RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 229 పేజీలు - 08 బుధవారం 15 జులై 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులు ప్రారంభించాలి..

### ఫ్యూచర్ సిటీ-బందరు పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ రహదారికి అనుమతులు

● రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయ రహదారి నిర్మించాలి ● కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జులై 14:** రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయినందున పనుల ప్రారంభానికి కేంద్ర క్యాబినెట్ అనుమతి ఇప్పించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి గడ్కరీతో ఢిల్లీలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఆర్ఆర్ఆర్ రెండువైపులా ఏకకాలంలో పనులు ప్రారంభమైతే నిర్మాణం త్వరగా పూర్తవుందుని, నిర్మాణ వ్యయం తగ్గుతుందని సీఎం తెలిపారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానికి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మిస్తామని ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్నందున వెంటనే ఆ రహదారికి అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్‌కు 12 వరుసల రహదారి మంజూరు చేస్తే హైదరాబాద్-విజయవాడల మధ్య 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను బందరు పోర్ట్‌కు సరకు రవాణా వేగవంతమవుతుందని సీఎం వివరించారు. మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి అటవీ

మిగతా2లో...

## అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విమానాశ్రయాల నిర్మాణం

- ఎంఆర్‌వో, ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలి..
- కాకతీయ సంస్కృతికి అద్దం పట్టేలా వరంగల్ విమానాశ్రయం
- ఆదిలాబాద్‌కు అవసరమైన భూ సేకరణచేపడతాం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జులై 14:** తెలంగాణ రాష్ట్రంలో నిర్మించనున్నవరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతోనిర్మించాలని పౌర విమాన యాన శాఖ మంత్రి రామ్మోహన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వ్యూహాత్మకంగా, వాణిజ్య పరంగా వరంగల్, ఆది లాబాద్ విమానాశ్రయాలకు ఉన్న మెరుగైన పరి స్థితులను సీఎం వివరించారు.

మిగతా2లో...

## ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయండి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి




**తొలి అక్షరం/హైదరాబాద్,జులై 14:** ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా అందజేసిన ఎన్యూరేషన్ ఫారాలను వెంటనే పూర్తి చేసి బిఎల్‌ఒలకు వెంటనే

మిగతా2లో...

## మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇకలేరు..!



**తొలి అక్షరం/అమరావతి,జులై 14:** ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, వైకాపా సీనియర్ నాయకుడు ముద్రగడ పద్మనాభం కాపు ఉద్యమంతో ప్రసిద్ధి చెందిన ముద్రగడ పద్మనాభం ఇకలేరు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన 73 ఏళ్ల వయసులో అందర్నీ విషాదంలో

మిగతా2లో...

## నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా

- రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాలు
- ఎర్రవల్లి వద్ద రూ.155 కోట్లతో ఉప కేంద్రం నిర్మాణం
- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



2లో

## సోషల్ మీడియాలో ఇందిరమ్మ ఇండ్ల హవా

- హోం టూర్ వీడియోల హల్ చల్
- ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేస్తాం-
- ఎక్స్ వేదికగా మంత్రి పొంగులేటి



2లో



## ఎల్‌నినో పరిస్థితులకనుగుణంగా పంటల ప్రణాళిక

మెట్ట పంటలకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలి

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**తొలి అక్షరం/హైదరాబాద్,జులై 14:** ఈ రోజు నిర్వహించిన 'రైతు నేస్తం' కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. రైతులతో నేరుగా మాట్లాడి వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసు కున్నారు. ఈ ఏడాది తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా వర్షపాతం తక్కువగా నమోదవుతోందన్నారు. దీంతో కృష్ణా, గోదావరి ఆయకట్టు ప్రాంతాల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. భూగర్భ జలాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి రైతులకు సరైన సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయశాఖ, నీటిపారుదల శాఖ, భూగర్భ జలాల శాఖ, భారత వాతావరణ శాఖ అధికారులు సమన్వయంతో

మిగతా2లో...

## ఊరూరా బిఆర్ఎస్ కుట్రలపై ప్రచారం

- కెసిఆర్ హాయంలోనే కూలిన కాళేశ్వరం
- కేంద్ర నిపుణులు సూచనల మేరకు నీటి విడుదల
- మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి




**తొలి అక్షరం/హైదరాబాద్,జులై 14:** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే కాళేశ్వరం కుంగిపోయిందని బీఆర్ఎస్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ మరోసారి విరుచుకుపడ్డారు. కాళేశ్వరం కూలడానికి కారణం బీఆర్ఎస్ అని ఆరోపిం చారు. ఊరూరా తిరిగి బీఆర్ఎస్ చేసిన కుట్రలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడు తూ.. రక్తం ప్యాకెట్లతో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. ఎన్‌డీఎస్ఏ తుది నివేదిక ఇచ్చి కాళేశ్వరంలో నీటిని నింపమని చెబితే.. వెంటనే నింపుతామని చెప్పారు. ఇంజినీర్లు ఇచ్చిన సలహాలను పాటిస్తామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఉపయోగంలోకి

మిగతా2లో...



## ఆషాఢ బోనాలకు భారీగా ఏర్పాట్లు

- భక్తులకు ఇబ్బంది లేకుండా భద్రతా చర్యలు
- నగర పోలీస్ అధికారులతో సజ్జన్నార్ సమీక్ష

**తొలి అక్షరం/హైదరాబాద్,జులై 14:** ఆషాడ బోనాల ఉత్సవాలు శాంతియుతంగా, వైభవంగా నిర్వహించడమే లక్ష్యమని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ బోనాలు.. మొదటి 15 రోజులు అత్యంత కీలకమని తెలిపారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. మంగళవారం బంజారా హిల్స్‌లోని టీజీఐసీసీసీలో ఆషాడ బోనాలపై ఆ శాఖ అధికారులతో సజ్జన్నార్ సమీక్ష నిర్వహించారు. ఈ బోనాలకు పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జూలై 16 నుంచి ఆగస్టు13వ తేదీ వరకు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గోల్కొండ, బల్కంపేట, ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ ఆలయాలపై

మిగతా2లో...

# అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విమానాశ్రయాల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి ఢిల్లీలోని పౌరవిమానయాన శాఖ కార్యాలయం లోమంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగావరంగల్ విమానాశ్రయ పనులపై కేంద్ర మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. రైలు, రోడ్డు మార్గాలతో అనుసంధానమైఉండడంతో పాటు కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఇతరపరిశ్రమలతో వరంగల్కీలకనగరంగా ఉందని సీఎం తెలిపారు. రానున్న రోజుల్లో పారిశ్రామికంగా మరింతగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం తెలియజేశారు. ఉత్తరతెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండజిల్లాలకు కేంద్రంగా వరంగల్ ఉంటుందని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్), ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే భూ సేకరణ పూర్తి చేసినందున టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. 2028, జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగావరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లపై కేంద్ర మంత్రి, సీఎం చర్చించారు. వరంగల్‌కు ఘనమైన చరిత్ర ఉన్నందున, కాకతీయ చరిత్ర, సంస్కృతికి అద్దంపట్టేలా డిజైన్లు ఉండాలనిభావిస్తున్న ట్లు సీఎం తెలిపారు. అందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సుముఖత వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణశాఖ ఆధ్వర్యంలో ఎయిర్ పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయంనిర్మించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం విజ్ఞప్తి చేశారు. రెండు ఎయిర్‌పోర్ట్‌లకు అవసరమైన భూమిని సేకరించి అందజేస్తామని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో మాదిరే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ లోనూ ఎంఆర్‌వో, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు నెలకొల్పాలన్నారు. వరంగల్, ఆదిలాబాద్ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణసంస్థలు (ఈ-ఉక్ష)నెలకొల్పాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి సీ ప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సూచించారు. అందుకు అవసరమైనప్రతిపాదనలుసమర్పించాలని కేంద్ర మంత్రి సీఎంకు సూచించారు. సమావేశంలోనల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వసలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీకె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీకోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్, పౌరవిమానయాన శాఖ సెక్రటరీ మురళీధర్మోహోల్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ విపిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలు ఎన్నికల సమయానికే పరిమితం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశం అనంతరం సీఎం విలేకరులతో మాట్లాడారు. దేశాల అభివృద్ధిలో విమానాశ్రయాలుకీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన తెలిపారు. తెలంగాణలోనూ విమానాశ్రయాల అభివృద్ధి ద్వారా యువతకు ఉద్యోగాల కల్పన, అభివృద్ధికి తాము పాటుపడుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ అంశాల్లో తమకుసహకరిస్తుందని, ఎక్కడైనా సమస్యలుంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు.

# నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా

**తొలి అక్షరం/మహబూబ్‌నగర్,జులై 14 :** నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉప కేంద్రాలను నిర్మిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంగళవారం వడ్డేపల్లి మండలం శాంతినగర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చాపర్ లో వచ్చిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర అతిథులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలు, మొక్కలతో స్వాగతం పలికి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. జులేకల్ గ్రామానికి రోడ్డు మార్గంలో చేరుకొని అలంపూర్ నియోజకవర్గంలోని జులేకల్, పచ్చర్ల, పుల్లూరు, మేడికొండ ప్రాంతాల్లో నిర్మించిన 33/11 కెవి ఉపకేంద్రాలను ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, మత్స్య, పశుసంవర్ధక, క్రీడల శాఖల మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. అలాగే ఎర్రవల్లి మండల కేంద్రం వద్ద రూ.155 కోట్ల నిధులతో 220/132/33 కెవి ఉపకేంద్రం నిర్మాణానికి కూడా ఇక్కడే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ట్రాన్స్ఫార్మర్లను పంపిణీ చేశారు. అనంతరం సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రసంగించారు. జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా మంగళవారం రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవాలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ట్రాన్స్కో సీఎండి కృష్ణ భాస్కర్, టీజీ ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్, సంస్థ డైరెక్టర్లు శివాజీ, నరసింహులు, రూరల్ జోన్ సీఈ బాలస్వామి, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఇన్చార్జి ఎస్ఈ నాగరాజు, డిఈ రవి ప్రసాద్, ఇతర ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు, జిల్లా నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో పరిస్థితులకనుగుణంగా పంటల ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

పనిచేసి రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వాలని చెప్పారు. వర్షపాతం తక్కువగా ఉన్నందున జొన్న, సజ్జ, కొర్ర, పెసర, మినుము, కంది వంటి తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని మంత్రి సూచించారు. అలాగే శాస్త్రవేత్తలు సూచించిన విధంగా తక్కువ కాలంలో పండే, తక్కువ నీరు అవసరమయ్యే అధిక దిగుబడి పంట రకాలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఐఐఎంఆర్ డైరెక్టర్ మాట్లాడుతూ కొర్ర, సజ్జ, జొన్న వంటి చిరుధాన్యాల సాగును పెంచాలని రైతులకు సూచించారు. భారత వాతావరణ శాఖ, హైదరాబాద్ సంచాలకురాలుస్టెల్లా మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఇప్పటివరకు సాధారణం కంటే 30 నుంచి 35 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. వచ్చే మూడు నెలల్లో కూడా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున తక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు మాట్లాడుతూ ఎగువ రాష్ట్రాల్లో కూడా వర్షపాతం తక్కువగా ఉండటంతో కృష్ణా, గోదావరి నదుల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందన్నారు. అందువల్ల నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలు సాగు చేయాలని సూచించారు. భూగర్భ జలాల శాఖ డైరెక్టర్ జిల్లాల వారీగా భూగర్భ జలాల పరిస్థితిని వివరించారు. రాబోయే రోజుల్లో నీటి మట్టం మరింత తగ్గే అవకాశం ఉన్నందున వరి, చెరకు వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. రైతు నేస్తం కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి . సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి, సహకార శాఖ ప్రత్యేక సంచాలకులు రాహుల్ రాజ్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్తాస్ జానయ్య, నీటిపారుదల శాఖ ఇంజినీర్-ఇన్-చీఫ్ మధుసూదన్ రావు, భూగర్భ జలాల శాఖ సంచాలకులు లక్ష్మణ్, భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సత్యవతి, ఐఎండీ శాస్త్రవేత్త డాక్టర్ శ్రావణి, భారత నూనెగింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సురేష్, మెట్ట పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ కె.వి. రావు, అలాగే ప్రొ. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ మహాదేవప్ప పాల్గొ న్నారు. కార్యక్రమంలో ఆయా రంగాలకు సంబం ధించిన నిపుణులు రైతులకు ఎల్‌నినో పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే పంటల నిర్వహణ, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ పంటల సాగు, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై పలు సూచనలు చేశారు.

# ట్రైబల్ ఏరియాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధి

**ఆస్పత్రుల్లో అభివృద్ధికి కొత్త పాలసీతో ముందుకు వెళుతున్నాం**

**ప్రజలకు సమీపంలో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు**

**భద్రాద్రని కొత్తగూడెం జిల్లా ప్రతినిధులతో మంత్రి దామోదర సమీక్ష**



**తొలి అక్షరం/హైదరాబాద్,జులై 14:** భద్రాద్రి కొత్తగూడెం సహా, రాష్ట్రంలోని అన్ని ట్రైబల్ ఏరియాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధికి కొత్త పాలసీని తీసుకొస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఐటీడీఏల పరిధిలో ఉన్న అన్ని ఏరియా హాస్పిటల్స్‌లో, దశలవారీగా సీటీ స్కాన్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు. ఈ ప్రాంతాల్లో జనాభా ప్రాతిపదికన కాకుండా, ప్రజలకు సమీపంలో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా దూరాన్ని బట్టి హాస్పిటళ్లను అభివృద్ధి చేస్తామని, అవసరమైన చోట కొత్త సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలను మంజూరు చేస్తామన్నారు. అవసరాన్ని బట్టి ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటళ్లలను అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు కొత్తగూడెం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సెక్రటేరియట్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనుకయ్య, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవిందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. కొత్తగూడెం మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంత్రిని కోరారు. ఎంసీహెచ్, జీజీహెచ్ నడుమ డిస్టన్స్ ఎక్కువగా ఉందని, ఈ నేపథ్యంలో ఎంసీహెచ్‌కు ప్రత్యేకంగా ఒక ఇంచార్జ్ సూపరింటెండెంట్‌ను నియమించాలన్నారు. కొంత మంది డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కూనంనేని కోరారు. జిల్లాలో ప్రతి మండలానికి ఒక అంబులెన్స్, కొత్తగా 4 డయాలసిస్ సెంటర్లు మంజూరు చేసినందుకుగానూ ఎమ్మెల్యేలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కమ్యునిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటల్స్‌కు అనుబంధంగా అంబులెన్స్‌లను మంజూరు చేయాలని ఎమ్మెల్యేలు కోరారు. కొత్తగూడెం జిల్లాల్లోని ఏరియా హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని పీహెచ్‌సీలలో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా వాటిని అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. టీచింగ్ హాస్పిటల్, జిల్లా హాస్పిటల్, ఏరియా హాస్పిటళ్లు, సీహెచ్‌సీలలో జనరేటర్లు ఇటీవలే ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, తమది అటవీ ప్రాంతం అయినందున వర్షాల సమయంలో పవర్ కట్ సమస్య ఉంటుందని, ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని పీహెచ్‌సీలలోనూ జనరేటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రి దామోదర మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అత్యంత మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. అడవులు, కొండలు, దూర ప్రాంతాలు, రవాణా సమస్యలు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో అడ్డంకులు కాకూడదు అన్నారు.

# మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇకలేరు..!

(మొదటి పేజీ తరువాయి)

ముంచుతూ ఈ లోకాన్ని విడిచి వెళ్లారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో జన్మించిన ముద్రగడ.. తండ్రి వీర రాఘవరావు స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చారు. వీర రాఘవరావు ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందగా.. 1978లో జనతా పార్టీ ఎమ్మెల్యేగా ముద్రగడ తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన మంత్రిగా సేవలందించారు.కన్నుమూశారు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధ పడుతున్న ముద్రగడ మంగళవారం సాయంత్రం ప్రాణాలు విడిచారు. హైదరాబాద్ సింధు ఆస్పత్రిలో శ్వాసకోస సమస్యకు చికిత్స పొందుతూ.. పరిస్థితి విషమించడంతో ముద్రగడ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో ఏపీలో విషాదం నెలకొంది.

# ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులు ప్రారంభించాలి..

(మొదటి పేజీ తరువాయి)

శాఖ అనుమతులు ఇప్పించేందుకు కృషి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్ఢరీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. నల్లమల అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, శ్రీశైలం జలాశయాలు ఈ కారిడార్ పరిధిలో ఉంటాయని సీఎం తెలిపారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు ఆరు వరుసల ప్రత్యామ్నాయ రహదారికి అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యామ్నాయ రహదారికి అవసరమైన భూ సేకరణ తాము చేపడతామని సీఎం తెలిపారు. ఈ ప్రత్యామ్నాయ రహదారి వ్యవసాయ, వ్యాపారపరంగా నూతన అవకాశాలను సృష్టిస్తుందని సీఎం తెలిపారు. సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ దితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో ఇందిరమ్మ ఇండ్ల హవా

**తొలి అక్షరం/హైదరాబాద్,జులై 14:** ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయిన రోజు నుంచి గృహ ప్రవేశం వరకు తమ ఆనందాన్ని, అనుభవాలను అనేక మంది లబ్దిదారులు యూట్యూబ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. తొలిదశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు, రెండో దశలో 2.5 లక్షల ఇండ్లు.. మూడో దశ, నాలుగో దశ, ఐదో దశ.. ఇలా ప్రతి పేదవాడి సొంతింటి కలను ఇందిరమ్మ ఇండ్ల రూపంలో సాకారం చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేదల చిరునవ్వులే మా ప్రభుత్వానికి గొప్ప పురస్కారాలని పేర్కొన్నారు. గతంలో లాగా మభ్య పెట్టే కార్యక్రమంగా కాకుండా పేదలకు ఇళ్లను నిర్మించి ఇస్తున్నామని, అందుకు వీడియోలే సాక్ష్యమనితెలిపారు.

# ఊరూరా బిఆర్ఎస్ కుట్రలపై ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

రావాలంటే ఏం చేయాలో నిపుణులు చెబితే వెంటనే అమలు చేస్తామని మంత్రి వెల్లడించారు. ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. కరవును దృష్టిలో పెట్టుకొని ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే మేడిగడ్డ, కన్నెపల్లి విషయంలో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. వర్షాలు తక్కువ పడతాయని శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు చెబుతున్నారన్నారు. ఎల్‌నినోను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరపున సూచనలు చేస్తున్నామని చెప్పారు. కరవును దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్నామ్యాయ పంటలు వేసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలుగా అంతర్గతంగా ఎన్ని సమస్యలు ఉన్నా కలిసి ఎదుర్కోవాలని.. బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా సలహాలు, సూచనలు ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ఆషాఢ బోనాలకు భారీగా ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. టాస్క్‌ఫోర్స్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సిటీ ఆర్మ్‌డ్, రిజర్వ్, క్విక్ రియాక్షన్ టీమ్స్ భారీగా మోహరిస్తున్నట్లు వివరించారు. భక్తులకు సమాచారం కోసం ఆలయాల వద్ద పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ వివరించారు. మహిళా భక్తుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని.. అందుకోసం షీ టీమ్స్‌తో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈవ్ టీజింగ్, గొలుసు దొంగతనాలు, మొబైల్ స్నాచింగ్, జేబుదొంగలపై ఉక్కుపాదం మోపనున్నట్లు చెప్పారు.

గత బోనాల్లో 644 మంది ఆకతాయిలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని ఆయన గుర్తు చేశారు. బోనాల ఊరేగింపులు, పోతురాజుల విన్యాసాలు, ఘటాల ఊరేగింపులకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని వివరించారు. ఆలయాల పరిసరాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని నగర సీపీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయండి

(మొదటి పేజీ తరువాయి)

అందజేసి మీ యొక్క అమూల్యమైన ఓటుహక్కును కాపాడుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఐఎఎస్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. బిఎల్ఒలు అందజేసిన ఫారాల్లో ఎలాంటి తప్పులు లేకుండా పూరించి, ఫోటోలను అతికించి బిఎల్ఒలకు అందించాలని సిఇఒ కోరారు. ఎన్యూమరేషన్ ఫారంలో తప్పనిసరిగా ఓటర్ సంతకం, తేదీతో పాటు బిఎల్ఒల సంతకం ఉండేలా చూసుకోవాలని సూచించారు. బిఎల్ఒలు ఓటర్లకు అందజేసిన రెండు ఎన్యూమరేషన్ ఫారాల్లో ఒకటి బిఎల్ఒలకు ఇవ్వాలని, మరొకటి ఓటర్ భద్రపరుచుకోవాలని పేర్కొన్నారు. పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్ఒలకు ఇస్తేనే డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో ఓటరు పేరు నమోదు అవుతుందని స్పష్టం చేశారు. 2002 ఓటరు జాబితాలో ఓటర్ వివరాలు ఉన్నట్లయితే తప్పనిసరిగా నింపాలని, ఒకవేళ అటువంటి వివరాలను లేకపోయిన ప్రస్తుత వివరాలతో ఎన్యూమరేషన్ ఫారాలను నింపి బిఎల్ఒలకు అందజేయాలన్నారు. రాష్ట్రంలోని మొత్తం3,38,26,448 మంది ఓటర్లలో ఇప్పటివరకు 1,66,70,610 మంది ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారమ్‌లను సమర్పించారు. సర్ పక్రియ జూన్ 25 నాడు ప్రారంభమైందని, మరో పది రోజుల్లో ఈ పక్రియ ముగుస్తుందని, ఓటర్లు పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే బిఎల్ఒలకు అందజేయాలని సూచించారు.

# “సేవా భాగ్యం దక్కడం నా పూర్వజన్మ సుకృతం“.. భక్తురాలు శివకుమారి

**నిజాంపేట్ శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో వైభవంగా**

**మహా అన్నదాన కార్యక్రమం**

**గత రెండేళ్లుగా స్వామివారిని దర్శిస్తున్నా..**


**కోరిన కోర్కెలు తీర్చే మహిమాన్విత దైవం**

**అని భక్తురాలి విశ్వాసం**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జూలై 14:** నిజాంపేట్ శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం మహా అన్నదాన కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన వందలాది మంది భక్తులకు అన్నప్రసాదాన్ని భక్తిపూర్వకంగా వడ్డించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా భక్తురాలు, ఆలయ సేవకురాలు శివకుమారి మాట్లాడుతూ, “ఈ సేవా భాగ్యం నాకు లభించడం నా పూర్వజన్మ సుకృతం. శ్రీ అభయ ఆంజనేయ స్వామివారి అపారమైన కృపా కటాక్షాల వల్లే ఈ మహా అన్నదాన సేవలో భాగస్వామిని అయ్యాను. గత రెండు సంవత్సరాలుగా ప్రతివారం స్వామివారిని దర్శించుకుంటూ వస్తున్నాను. స్వామివారి సన్నిధిలో అడుగుపెట్టిన ప్రతిసారీ మనసుకు ప్రశాంతత, జీవితానికి ధైర్యం లభిస్తున్నాయి. భక్తులు నిజమైన విశ్వాసంతో ప్రార్థిస్తే కోరిన కోర్కెలను నెరవేర్చే మహిమాన్విత దైవం శ్రీ అభయ ఆంజనేయ స్వామి. స్వామివారి ఆశీస్సులతోనే నా కుటుంబానికి ఎన్నో శుభాలు కలిగాయి. అందుకే ఈ సేవను నా జీవితంలో గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను. ప్రతి భక్తుడు తనకు చేతనైన సేవను స్వామివారికి అంకితం చేస్తే ఆ దైవానుగ్రహం తప్పకుండా లభిస్తుంది“ అని అన్నారుమహా అన్నదాన కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, సేవకులు, మహిళలు, యువతతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులందరికీ మహా ప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తి, సేవాభావం, సమాజ సేవకు ప్రతీకగా నిలిచిన ఈ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

# రామన్నపేట మండలంలో ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణ



**తొలి అక్షరం/రామన్నపేట జూలై 14:** రామన్నపేట మండలంలోని హరిజనవాడ కాలనీలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జమీరుద్దీన్ ఆధ్వర్యంలో కాలనీవాసులు ఎన్నికల ఎన్యుమరేషన్ ఫారాలను నింపి ఎన్నికల శాఖ సీనియర్ అసిస్టెంట్ రమావత్ వినీతాబాయి, బూత్ లెవల్ ఆఫీసర్ బి ఎల్ ఓ మేడి లలితలకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలు తమ ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని, ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొనాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బొడ్డు సాలయ్య, సురేందర్ రావు, గ్రామపంచాయతీ బిల్ కలెక్టర్ నకిరేకంటి రాములు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బహుమతుల అందజేత







**తొలి అక్షరం/రామన్నపేట జూలై 14:** రామన్నపేట మండలం నీర్నంల గ్రామంలో మంగళవారము 14.07.2026 నాడు ఎంపీయుపిఎస్ నీర్నేముల పాఠశాల యందు స్వచ్ఛత పక్వాడ అంశంపై హెచ్పిసిఎల్ కంపెనీ ప్రతినిధులు విద్యార్థులకు ఎస్సే రైటింగ్ డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించడం జరిగింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హెచ్పీసీఎల్ సీనియర్ మేనేజర్ అయ్యప్ప పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. రవి, నీర్నేముల గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బహుమతుల ప్రధానం చేశారు. అనంతరం పాఠశాల యందు మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు విజ్ఞేశ్వరరాణి, కృపా రాణి, లింగస్వామి, ఆవుల నవ్య, బట్టు నవనీత గ్రామ ఉపసర్పంచ్ ఆవుల శ్రీశైలం యాదవ్ వార్డు మెంబర్లు కట్ట కుమార్ ముత్యాల కిషన్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ నాయకుల అక్రమ అరెస్టు ఖండిస్తున్నాం

**రాష్ట్ర ఎస్ఎఫ్ఐ సచివాలయ ముట్టడికి పిలుపు నేపథ్యంలో రామన్నపేటలో ఎస్ఎఫ్ఐ నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం**

**ఎస్ఎఫ్ఐ రామన్నపేట మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్**




**తొలి అక్షరం/రామన్నపేట జూలై 14:** విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ఎస్ ఎఫ్ ఐ చేపట్టిన సచివాలయ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న ఎస్ ఎఫ్ ఐ నాయకులను, కార్యకర్తలను రామన్నపేటలో పోలీసులు ముందస్తుగా అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు ఎస్ ఎఫ్ ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్ ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కు. అలాంటి హక్కును కాలరాస్తూ విద్యార్థి నాయకులను నిర్బంధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వాటిపై స్పందించకుండా ఉద్యమాలను అణచివేయడానికి ప్రయత్నించడం బాధాకరం అన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది పేద విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ రాక చదువులకు దూరం దూరమవుతున్నారు కాలేజీ యజమాన్యాలు సర్టిఫికెట్ ఇవ్వకుండా వేధిస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాల్సింది పోయి గొంతు నొక్కే ప్రయత్నం చేయడం దుర్మార్గం అరెస్టులతో మా ఉద్యమాలను ఆపలేరు వెంటనే 11 వేలకోట్ల బకాయిల నీటిని ఏకకాలంలో విడుదల చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని ఉద్యమాలకు పిలుపునిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఇలాంటి అక్రమ అరెస్టులు ఉద్యమాలను ఆపలేవని, విద్యార్థుల హక్కుల కోసం ఎస్ ఎఫ్ ఐ పోరాటం మరింత ఉధృతంగా కొనసాగుతుందని హెచ్చరిస్తున్నాం. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యురాలు పెద్ది అక్షిత మండల నాయకులు అప్పం అభిరుప్ మామిడి నవీన్ పిట్టల నవీన్ బూడిది ఆదిత్య తదితరులు పాల్గొన్నారు

# ధర్మతండలో సీతల భవాని వేడుకలకు హాజరైన బంజరుపల్లి సర్పంచ్ ,నెక్కొండ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు భూక్య రమేష్ రాథోడ్.







**తొలి అక్షరం/నెక్కొండ జూలై 14:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని బంజరపల్లి గ్రామం ధర్మతండలో బంజారాల ఆరాధ్య దైవం సీతలా భవాని వేడుకలను అట్టహాసంగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బంజరపల్లి సర్పంచ్, నెక్కొండ మండలం సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు భూక్య రమేష్ రాథోడ్. హాజరవడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ బంజారా సోదరీ సోదరీమణులకు సీత్లా భవాని, (గొడ్ల దాటుడు ) పండుగ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సీజన్లో పశు వులు ఆరోగ్యంగా ఉండాలని ఆ సీత్లా లా భవాని ని వీడిపోవడం జరిగింది.. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు రాజు మౌనిక, స్వాతి అనిల్, తండ పెద్దమనిషి జు మిలాల్ నాయక్, పంతులు, మాజీ సర్పంచ్ బాదావత్ స్వరూప రవి, కిషన్ నాయక్ , తిరనాల్, పూజారి శ్రీను నాయక్ భాస్కర్ శంకర్,లాల్ రమేష్ బాబు సాగర్ నాగరాజు రమేష్ రవి కృష్ణ, పాప శంకర్ మరియు తండా వాసులందరూ అధిక సంఖ్య లో పాల్గొనడం జరిగింది.

# గొరిగే నరసింహ ఆశయాలను కొనసాగించాలి..

**హక్కుల కోసం కార్మికులు ఉద్యమించాలి..**

**ఏఐటీయూసీ జాతీయ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు పిలుపు..**




**తొలి అక్షరం/రామన్నపేట జులై 14:** ఏఐటీయూసీ యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షులు, సివిల్ సప్లై హమాలి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొరిగే నరసింహ ఆశయాలను కొనసాగిస్తూ, కార్మికులు తమ హక్కుల కోసం ఉద్యమించాలని ఏఐటీయూసీ జాతీయ నాయకులు ఉజ్జిని రత్నాకరావు పిలుపునిచ్చారు. మంగళవారం రామన్నపేట మండల కేంద్రంలోని సివిల్ సప్లై గోదాం ప్రాంగణంలో గొరిగే నరసింహ సంతాప సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గొరిగే నరసింహ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించి అయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేసారు. అనంతరం ఉజ్జిని రత్నాకర్ రావు మాట్లాడుతూ గొరిగే నరసింహ జీవితాంతం కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నిజాయితీపరుడైన ఉద్యమ కార్మిక నాయకుడని కొనియాడారు. సివిల్ సప్లై హమాలి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని, కార్మిక ఉద్యమంలో ఆయన చూపిన నిబద్ధత అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం మరింత బలంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తూ కార్మిక చట్టాలను 4 కోడ్ లుగా మార్చి కార్మిక హక్కులను హరించి వేస్తుందని ఆయన ఆరోపించారు కార్మికుల వర్గానికి సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఏఐటీయూసీ మండల అధ్యక్షులు బత్తుల సత్యం అధ్యక్షతన జరిగిన సభలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్, జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శంకర్ కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, సివిల్ సప్లై యూనియన్ జిల్లా అధ్యక్షులు పల్లె శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి ఉట్కూరి నరసింహ , సిపిఐ జిల్లా నాయకులు ఎర్ర రమేష్, పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, ఏఐటీయూసీ మండల కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, రామన్నపేట సివిల్ సప్లై గోడౌన్ ఇన్చార్జి కుసుమ, డిఈఓ ఊర్మిళ, సివిల్ సప్లై హమాలి యూనియన్ నాయకులు గొరిగే శంకరయ్య, పాపగల్ల శంకరయ్య, పిగ్నం జగన్, కస్తూరి కొండల్, పురుగుల రవి, నరసింహ కొడుకు కోడలు నరేష్ శైలజ హమాలి నాయకులు ముదిగొండ బసవయ్య, జంగా నర్సయ్య, బండ స్వామి, గోర్ల తిరుపతి, కోటూరి శ్రీనివాస్ మడుగుల స్వామి, మోటే నగేష్, జీడయ్య, జంగయ్య, రమేష్, లింగస్వామి పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ

**- చేసిన నెక్కొండ సర్పంచ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్, మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి**



**తొలి అక్షరం/నెక్కొండ జూలై 14:** వరంగల్ జిల్లా నెక్కొండ గ్రామానికి చెందిన కీర్తి శేషులు చల్లా నాగిరెడ్డి పేరు మీద వచ్చిన ముఖ్యమంత్రి సహాయ నిధి లక్ష రూపాయల చెక్కును వారి ఇంటికి వెళ్లి అతని కూతురు స్వప్న మరియు తల్లి అనంతలక్ష్మి లకు అందించిన,నెక్కొండ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఈదునూరి సాయికృష్ణ,మార్కెట్ డైరెక్టర్ బొమ్మెర బోయిన రమేష్ యాదవ్, డిసిసి సభ్యులు నేతుల సారంగపాణి యాదవ్, వార్డు సభ్యుడు చల్లా విష్ణువర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చల్లారగోతంరెడ్డి, గంధం రాజు, ఆంజనేయస్వామి దేవాలయం డైరెక్టర్ కక్కెర్ల శ్రీనివాస్, రావుల కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

# నేడు బోడుప్పల్‌లో విద్యుత్ అంతరాయం

**- అత్యవసర నిర్వహణ పనుల కారణంగా సరఫరా నిలిపివేత**

**- ఉదయం,మధ్యాహ్నం వేళల్లో వేర్వేరు ప్రాంతాల్లో అంతరాయం**

**- బోడుప్పల్ ఆపరేషన్స్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) ఎన్. వేణుగోపాల్**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూలై 14:** బోడుప్పల్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని వినియోగదారులకు బుధవారం విద్యుత్ అంతరాయం కలగనుంది. సబ్‌స్టేషన్లలో అత్యవసర నిర్వహణ పనులతో పాటు, లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల నరికివేత పనుల కారణంగా ఆయా ప్రాంతాల్లో వేర్వేరు సమయాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు బోడుప్పల్ ఆపరేషన్స్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) ఎన్. వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.

**ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12గంటల వరకు:**

33/11 కేవీ ఇందిరానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ వివేకానంద ఫీడర్ పరిసర ప్రాంతాలైన మణికంఠ నగర్, వివేకానంద నగర్, శ్రీ లక్ష్మి నగర్, లెక్చరర్స్ కాలనీ, ఐఐసీటీ కాలనీ, భీంరెడ్డి కాలనీ, అశోక నగర్, గ్రీన్ సిటీ కాలనీ, అణగాపురి కాలనీల్లో ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు సరఫరా ఉండదు.

**మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 గంటల వరకు:**

33/11 కేవీ బోడుప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ సత్తిరెడ్డి కాలనీ ఫీడర్ పరిసర ప్రాంతాలైన ఉదయ లక్ష్మి నగర్, ఎన్టీఆర్ విగ్రహం మెయిన్ రోడ్డు, ఉదయ్ నగర్, కేశవ్ నగర్, భువన హాస్పిటల్ లైన్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం మూడు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ నిలిపివేయబడుతుంది. అత్యవసర సాంకేతిక పనుల నిమిత్తం చేస్తున్న ఈ విద్యుత్ కోతను గమనించి, వినియోగదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఏఈ వేణుగోపాల్ కోరారు. పనులు పూర్తయిన వెంటనే సరఫరాను యథావిధిగా పునరుద్ధరిస్తామని ఆయన వివరించారు.

# భీమదేవరపల్లి కస్తూర్బా పాఠశాలలో బాలికలకు శానిటరీ ఫ్యాట్స్ అందజేసిన సర్పంచ్ మాచర్ల కుమారస్వామి



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: భీమదేవరపల్లి సర్పంచ్,బిజేపి జిల్లా ఉపాధ్యక్షులు మాచర్ల కుమారస్వామి కస్తూర్బా పాఠశాలలో బాలికలకు శానిటరీ ఫ్యాట్స్ అందజేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ...నెలసరి అన్నది ప్రతి మహిళా జీవితంలో సహజమైన శారీరక ప్రక్రియ ఒక కొత్త జీవి పుట్టుటకు కారణమయ్యే అత్యంత పవిత్రమైన ప్రక్రియ ఇది కానీ దురదృష్టవశాత్తూ మన సమాజంలో దీని మీద ఎన్నో అపనమ్మకాలు మూడాచారాలు ఉన్నాయి.దీని గురించి మాట్లాడడానికి ఆడపిల్లలు సిగ్గు పడుతుంటారు దాస్తూ ఉంటారు.మహిళా ఆరోగ్యం బాగుంటేనే ఇల్లు బాగుంటుంది,ఇల్లు బాగుంటేనే సమాజం బాగుంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వంగర పి హెచ్ సి డా. రుబీనా మాట్లాడుతూ...నెలసరి సమయంలో ఎలా పరిశుభ్రంగా ఉండాలి అదేవిధంగా హెచ్ పి వి వ్యాక్సిన్ గురించి అవగాహన కల్పించారు.ఈ యొక్క కార్యక్రమంలో డా. రహ్మాన్,కేజీబీవీ ఇంచార్జ్ జ్యోతి,వెంకటేశ్వర్లు,శ్యామ్,సతీష్ కేజీబీవీ పాఠశాల టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసిన చెరువు ముందరి తండా గ్రామ సర్పంచ్ కునుసోత్ మంగమ్మ - శ్రీను.





తొలి అక్షరం/నెక్కొండ జూలై 14: వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చెరువు ముందరి తండా గ్రామ పంచాయతీ పరిధిలో బానోతు హతిరామ్ కు 34000 రూపాయలు మరియు అజ్మీర సుమన్ కు 10000 రూపాయలు మొత్తం 44,000 అక్షరాల నాలబై నాలుగు వేల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ కింద చెక్కుఅందజేసిన చెరువు ముందరి తండా గ్రామ సర్పంచ్ కునుసొతు మంగమ్మ- శ్రీను నాయక్ తండావాసులు మూడు జాన్య, భూక్యా సుమన్,భానోతు మోహన్ ,గుగులోతు శ్రీనివాస్, బోడపంతులు, బానోతు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# విద్యార్థులను విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించేలా తీర్చిదిద్దాలి

## ప్రభుత్వ క్రీడా పాఠశాల,జేఎన్ఎస్ స్టేడియం,స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలించిన హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి







తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: విద్య,క్రీడలు రెండింటిలోనూ రాణించేలా విద్యార్థులు ఎదగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో యువజన సేవలు & క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ క్రీడా పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల విద్యా ప్రమాణాలు,క్రీడా శిక్షణ,మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా నాలుగో,ఐదో తరగతి విద్యార్థులతో ఆంగ్ల,తెలుగు పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి అభ్యాస స్థాయిని కలెక్టర్ పరిశీలించారు.జాతీయ జెండా విశిష్టత,అశోక ధర్మచక్రం ప్రాధాన్యతపై విద్యార్థులు తెలిపిన సమాధానాలను అభినందించారు.విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతో పాటు వారి సహజ ప్రతిభను గుర్తించి,ఆయా క్రీడల్లో ప్రత్యేక శిక్షణ అందించడం ద్వారా రాష్ట్ర,జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులు, కోచ్‌లకు సూచించారు.ప్రతి విద్యార్థి ప్రతిభను గుర్తించి దానికి అనుగుణంగా శిక్షణ అందించడం ఎంతో అవసరమన్నారు.విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారికి అందిస్తున్న అల్పాహారం,మధ్యాహ్న భోజనం,పౌష్టికాహారం నాణ్యత,వసతి,ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.వివిధ జిల్లాల నుంచి వచ్చి ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డికి ఆదేశించారు.అనంతరం పాఠశాలలోని తరగతి గదులు,భోజనశాల,వంటశాల,వసతి గృహాలు,పరిశుభ్రత,మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు.విద్యార్థులకు పరిశుభ్రమైన,పోషకాహారంతో కూడిన ఆహారం అందేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా నాలుగో తరగతి విద్యార్థులకు కలెక్టర్ పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసి,బాగా చదువుకోవడంతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి జిల్లా,రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ప్రోత్సహించారు.అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని జిమ్ హాల్,ఇండోర్ స్టేడియం,ఇతర క్రీడా మౌలిక సదుపాయాలను పరిశీలించారు.ఇండోర్ స్టేడియంలో సుమారు రూ.70 లక్షల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై యువజన సేవలు మరియు క్రీడల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.అభివృద్ధి పనులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.స్విమ్మింగ్ పూల్ మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి అని అన్నారు.అనంతరం జిల్లా యువజన సేవలు & క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్ను కలెక్టర్ సందర్శించి నిర్వహణ తీరును సమీక్షించారు.స్విమ్మింగ్ పూల్,వాటర్ పైప్‌లైన్ వ్యవస్థ,జిమ్ సెంటర్,ఇతర మరమ్మత్తు,అభివృద్ధి పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా స్విమ్మింగ్ పూల్‌లో జరుగుతున్న మరమ్మత్తు,అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజలు,క్రీడాకారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్విమ్మింగ్ పూల్ సేవలను వినియోగించుకునేలా అవసరమైన అన్ని పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు.భద్రతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.స్విమ్మింగ్ పూల్ నిర్వహణలో ఎలాంటి అంతరాయం లేకుండా నైపుణ్యం కలిగిన సిబ్బందిని నియమించాలని సూచించారు.నిర్వహణలో లోపాలు తలెత్తకుండా క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేపట్టాలని, తరచూ మరమ్మత్తులు అవసరం లేకుండా శాశ్వత పరిష్కారాలతో నిర్వహణ చేపట్టాలని అధికారులకు సూచించారు.నిర్వహణ సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకొని,అవసరమైతే సాంకేతిక నైపుణ్యం కలిగిన సిబ్బందిని నియమించాలని పేర్కొన్నారు.జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ప్రశాంత్,జీడబ్ల్యూఎంసీ ఎస్ఈ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాధవి,రవికుమార్,డీఈ రాజ్‌కుమార్, యువజన సేవలు & క్రీడల శాఖ అధికారులు,పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఫారం బిఎల్ఓలకి తప్పకుండా అందించాలి



తొలి అక్షరం/రామన్నపేట జూలై 14:రామన్నపేట మండలంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై మంగళవారం ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఈ కార్యక్రమం ప్రతి అర్హుడి ఓటు హక్కును నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.మండలంలోని ప్రతి కుటుంబం తమ పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. పేర్లు లేకపోయినా, కొత్తగా ఓటరుగా నమోదు కావాల్సిన వారు ఉన్నా ఆలస్యం చేయకుండా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఓటర్ల జాబితాలో లోపాలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరి చేసుకోవాలనిబీఎస్పీ మండల అధ్యక్షుడు నకరేకంటి నరేష్ పత్రికా సమావేశంలో తెలిపినారు.

# స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి: ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్



తొలి అక్షరం/చౌటుప్పల్,జూలై 14: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించనున్న “చలో సచివాలయం“ కార్యక్రమానికి వెళ్తున్న ఎస్ ఎఫ్ ఐ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడాన్ని ఎస్ ఎఫ్ ఐ చౌటుప్పల్ మండల కమిటీ తీవ్రంగా ఖండించింది.ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ మండల అధ్యక్షుడు దాసరి ప్రకాష్, కార్యదర్శి తిగుళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు రూ.10,500 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో లక్షలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫీజులు చెల్లించకపోవడంతో విద్యాసంస్థలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధించడం వల్ల విద్యార్థుల ఉన్నత విద్య దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు.“ఎమ్మెల్యేల జీతాలకు నిధులు ఉన్నాయి.. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు మాత్రం కరువా?“ అని ప్రశ్నిస్తూ, విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల కోసం చేపట్టిన ఉద్యమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని విమర్శించారు.ఈ సందర్భంగా మండల సహాయ కార్యదర్శి సావిత్రి మనోజ్ కుమార్, మండల కమిటీ సభ్యుడు పోలేపల్లి మల్లేష్‌తో పాటు పలువురు ఎస్ ఎఫ్ ఐ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. అరెస్టులతో ఉద్యమాలను అణచివేయలేరని, పెండింగ్ బకాయిలు విడుదలయ్యే వరకు విద్యార్థుల తరఫున పోరాటం కొనసాగుతుందని ఎస్ ఎఫ్ ఐ చౌటుప్పల్ మండల కమిటీ స్పష్టం చేసింది.

# తిరుమల వెంచర్‌లో ఘనంగా వనమహోత్సవం

## - మోగుదాల పవని రమేష్ గౌడ్ చౌటుప్పల్ పురపాలక చైర్మన్






తొలి అక్షరం/చౌటుప్పల్,జూలై 14: 2026-27 వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ 9వ వార్డులోని తిరుమల వెంచర్‌లో మంగళవారం ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటగా, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతంగా జరిగింది.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ “వృక్షో రక్షతి రక్షితః“ అనే సందేశంతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారానే భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించగలమన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తిరుమల టౌన్షిప్ కాలనీ అధ్యక్షుడు మేడి రాములు, కాలనీవాసులు, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్ తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమంలో నీడనిచ్చే, పూలను ఇచ్చే పలు రకాల మొక్కలను నాటి, ప్రతి మొక్కను కంటికి రెప్పలా సంరక్షించాలని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. నాటిన ప్రతి మొక్కను పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్ సూచించారు.

# జ్యేష్ఠ మాస శివరాత్రి వేడుకలు ఘనం



తొలి అక్షరం/చౌటుప్పల్,జూలై 14: చౌటుప్పల్‌లోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ ప్రాంగణంలోని శ్రీ కాశీ విశ్వనాథ స్వామివారికి జ్యేష్ఠ మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం, సోమవారం సందర్భంగా ప్రత్యేక అన్నాభిషేకం ఘనంగా నిర్వహించారు.సకాలంలో వర్షాలు కురిసి లోకం సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో దేవాలయ ప్రధాన అర్చకులు పెద్ది సుధాకర శర్మ ఆధ్వర్యంలో, కృష్ణ కిషోర్ శర్మ, సతీష్ శర్మ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదం, అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ మాజీ ధర్మకర్త ఉప్పల కృష్ణ గుప్తతో పాటు పలువురు భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.“సకాలంలో వర్షాలు కురిసి.. లోకం సుభిక్షంగా ఉండాలని శ్రీ కాశీ విశ్వనాథునికి ప్రత్యేక అన్నాభిషేకం.“

# ఖాళీ ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలి: సీపీఎం




తొలి అక్షరం/చౌటుప్పల్,జూలై 14: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఎం చౌటుప్పల్ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్ డిమాండ్ చేశారు.ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో జూలై 15న హైదరాబాద్‌లోని ఇంద్రాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, నిరుద్యోగ యువత, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా గోశిక కరుణాకర్ మాట్లాడుతూ, దేశంలో, రాష్ట్రంలో లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ వాటి భర్తీలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీని అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 10 లక్షలకు పైగా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేసి భర్తీ చేయాలని, పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 20 వేల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.5 వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలని, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయడంతో పాటు రాజీవ్ యువ వికాస్ పథకాన్ని ప్రారంభించాలని, బ్యాక్‌లాగ్ పోస్టులన్నింటినీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ పాషా, నాయకులు బత్తుల దాసు, తూర్పునూరి మల్లేశం, అందగట్ల ఆనంద్, కనకయ్య, చికూరు దయ, జంగయ్య, రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ఫా ఫిట్‌నెస్ సెంటర్ తొలి వార్షికోత్సవం ఘనంగా నిర్వహణ

**ఫిట్‌నెస్ ఛాలెంజ్‌లలో విజేతలకు ఆకర్షణీయ బహుమతులు**

**కొత్త ఫిట్‌నెస్ మిషన్లు, అధికారిక వెబ్‌సైట్‌ను ప్రారంభించిన ఎస్ఐ ప్రణయ్**






**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 14:** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులో ఉన్న బజాజ్ షోరూం భవనం రెండో అంతస్తులోని ఆల్ఫా ఫిట్‌నెస్ సెంటర్ తొలి వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఉదయం నిర్వాహకులు మహేష్, ఉదయ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిమ్ సభ్యులు, యువత, ఫిట్‌నెస్ ప్రేమికులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సభ్యుల కోసం ప్రత్యేకంగా ఫిట్‌నెస్ ఛాలెంజ్‌లు, వివిధ గేమ్స్ నిర్వహించారు. పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న సభ్యులు తమ ప్రతిభను ప్రదర్శించగా, విజేతలకు ఆకర్షణీయ బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా ఒక నెలపాటు ఉచిత జిమ్ మెంబర్షిప్, రెండో బహుమతిగా క్రియాటిన్ సప్లిమెంట్ అందించి ప్రోత్సహించారు. ఈ పోటీలు సభ్యుల్లో ఆరోగ్యంపై మరింత ఆసక్తిని పెంచడంతో పాటు క్రీడాస్ఫూర్తిని పెంపొందించాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన షాద్‌నగర్ ఎస్ఐ ప్రణయ్ జిమ్‌లో ఏర్పాటు చేసిన కొత్త ఆధునిక ఫిట్‌నెస్ మిషన్లను, అలాగే ఆల్ఫా ఫిట్‌నెస్ అధికారిక వెబ్‌సైట్‌ను ప్రారంభించి కేక్ కటింగ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నేటి యువత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. ఇలాంటి ఫిట్‌నెస్ కేంద్రాలు సమాజంలో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని కొనియాడారు. జిమ్ నిర్వాహకులు మహేష్, ఉదయ్ మాట్లాడుతూ, సభ్యులకు అత్యాధునిక సౌకర్యాలు అందించేందుకు కొత్త ఫిట్‌నెస్ పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. సాంకేతికతను వినియోగిస్తూ సభ్యులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఫిట్‌నెస్ కార్యక్రమాలు, ఆరోగ్య అవగాహన శిబిరాలు నిర్వహించి యువతను ఆరోగ్యవంతమైన జీవనశైలి వైపు ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిమ్ సభ్యులు, యువత, స్థానిక ప్రముఖులు పాల్గొని నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. తొలి వార్షికోత్సవ వేడుకలు ఉత్సాహభరితంగా, విజయవంతంగా ముగిశాయి.

# దళితులపై వివక్ష అరికట్టాలి: గంగాదేవి సైదులు



**తొలి అక్షరం/చౌటుప్పల్, జూలై 14:** దేశంలో దళితులపై కుల వివక్ష, సామాజిక అణచివేత, దాడులు ఇప్పటికీ కొనసాగడం ఆందోళనకరమని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంగాదేవి సైదులు అన్నారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో భూహక్కులు, ఉపాధి, గృహాలు, తాగునీరు, రహదారులు వంటి మౌలిక సదుపాయాల విషయంలో దళితులు ఇంకా వివక్షను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి బాధితులకు తక్షణ న్యాయం అందించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అలాగే దళితుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టి, వారికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యాట బాలరాజు, మండల కార్యదర్శి చింతల సుదర్శన్, జిల్లా కమిటీ సభ్యుడు బోయ యాదయ్య, నాయకులు మానే సాలయ్య, యాట ముత్యాలు, పొట్ట వెంకటయ్య, నేరేడు మహేష్, జంగం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# మోత్కూలగూడ జెట్ట మహేందర్‌కు గ్రామ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు

- **కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం.. మోత్కూల గూడ గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జెట్ట మహేందర్**
- **పార్టీ విశ్వాసాన్ని నిలబెట్టుకుంటా.. జెట్ట మహేందర్**





**తొలి అక్షరం/నందిగామ, జులై 14:** రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మోత్కూలగూడ గ్రామానికి చెందిన జెట్ట మహేందర్‌ను గ్రామ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జెట్ట మహేందర్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నందిగామ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుమారస్వామి గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ గ్రామ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. అలాగే పార్టీ కార్యకర్తల మధ్య సమన్వయం పెంపొందిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా అంకితభావంతో పనిచేస్తానని జెట్ట మహేందర్ స్పష్టం చేశారు.

# ఏబీవీపీ పిలుపుతో షాద్‌నగర్‌లో కళాశాలల బంద్ విజయవంతం

**ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలంటూ ప్రభుత్వంపై ఏబీవీపీ ఆందోళన**



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 14:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు షాద్‌నగర్‌లోని పలు కళాశాలలు మంగళవారం బంద్ పాటించాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో రూ.11 వేల కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయని ఆరోపించారు. దీంతో ప్రతి ఏడాది లక్షలాది మంది విద్యార్థులు చదువును మధ్యలోనే నిలిపివేయాల్సి వస్తోందని, అనేక మంది తమ విద్యా సర్టిఫికెట్లు పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేయడం వల్ల పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని, ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రైవేట్ కళాశాలలు, అధ్యాపకులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విద్యార్థుల హక్కులని, ప్రభుత్వం వాటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యవర్గ సభ్యులు పవన్, కోమల్, రాహుల్, భార్గవ్, శివ, నందు, ప్రశాంత్‌తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ అడ్మిషన్లకు ఆగస్టు 7 వరకు గడువు

**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 14:** షాద్‌నగర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 202627 విద్యా సంవత్సరానికి సంబంధించిన డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ) కోర్సుల్లో ప్రవేశాలకు ఆగస్టు 7, 2026 వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎల్. కమల, కోఆర్డినేటర్ పల్లాడి శ్రీనివాసులు సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు, గృహిణులు, చదువు మధ్యలో నిలిపివేసిన వారు, ఉన్నత విద్యను కొనసాగించాలనుకునే వారికి ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ చదివే మంచి అవకాశం కల్పించబడిందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, విద్యార్హతలు, ఫీజులు, ప్రవేశ ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలు www.braouonline.in` వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లో చదువుతున్న విద్యార్థులు తమ కోర్సు ఫీజులను కూడా ఆగస్టు 7లోపు ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు. అడ్మిషన్లు, ఫీజులు తదితర వివరాల కోసం 73829 29657 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ఎస్ఐఆర్-2026 ఫారాలను సకాలంలో సమర్పించాలి..

- **ఓటర్లకు షాద్ నగర్ ఆర్డీఓ, (ఈఆర్ఓ)విజ్ఞప్తి..**



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 14:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమంలో భాగంగా పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ), మండల తహసీల్దార్ లేదా షాద్‌నగర్ పట్టణ పరిధి వారు మున్సిపల్ అధికారికి వెంటనే అందజేయాలని 84-షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఆర్డీఓ, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్వో) ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విడుదల చేసిన ప్రకటనలో, డివిజన్ పరిధిలోని ఓటర్లందరికీ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని తెలిపారు. ప్రజలు సమర్పించే ఫారాలను అధికారులు బీఎల్ఓ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉన్నందున, గడువులోపు ఫారాలను అందజేసి సహకరించాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్న ఈఆర్వో, అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసి ఓటర్ల జాబితాలో పేరు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఎలాంటి ఆలస్యం చేయకుండా ఎస్ఐఆర్-2026 కార్యక్రమంలో భాగస్వాములై ఎన్నికల ప్రక్రియ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# విద్య పేరుతో దోపిడీ... ఫీజుల దందాకు అడ్డుకట్ట ఎప్పుడు..?

- **ప్రైవేట్ పాఠశాలల అధిక వసూళ్లతో విలవిల్లాడుతున్న తల్లిదండ్రులు**
- **స్పందన లేని మండల విద్యాధికారిపై పలు అనుమానాలు**

**తొలి అక్షరం/ఏన్కూర్ జులై 14:** ఏన్కూర్ మండలంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి, తల్లిదండ్రుల నుంచి భారీ మొత్తాల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడ్మిషన్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు, పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, షూస్, ట్రాన్స్‌పోర్ట్, ఇతర ప్రత్యేక రుసుముల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తుండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. పిల్లలకు మంచి విద్య అందించాలనే ఆశతో తల్లిదండ్రులు అప్పులు చేసి, వడ్డీకి డబ్బులు తెచ్చి ఫీజులు చెల్లిస్తున్న పరిస్థితి నెలకొంది. ఒకే కుటుంబంలో ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలు చదువుతున్నట్లయితే వారి పరిస్థితి మరింత దయనీయంగా మారుతోందని ఆవేదన వ్యక్తమవుతోంది.

ఇంత జరుగుతున్నా మండల విద్యాశాఖ అధికారులు మాత్రం స్పందించడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ, నిబంధనల అమలుపై పర్యవేక్షణ చేయాల్సిన మండల విద్యాధికారి మౌనం పాటిస్తుండటంతో ప్రజల్లో అనేక అనుమానాలువ్యక్తమవుతున్నాయి.

తల్లిదండ్రుల ఫిర్యాదులు ఉన్నప్పటికీ తనిఖీలు నిర్వహించకపోవడం, అధిక ఫీజులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలను ప్రశ్నించకపోవడంపై మండల విద్యాధికారి తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం విద్యను అందరికీ అందుబాటులో ఉంచాలని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో నిబంధనలు అమలుకావడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై వెంటనే విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారువిద్య హక్కు... వ్యాపారం కాదు. పేదల బలహీనతను పెట్టుబడిగా మార్చే ఫీజుల దందాపై విద్యాశాఖ తక్షణమే స్పందించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# ఆంజనేయస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి ఘన శ్రీకారం

**- గ్రామస్తుల భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమైన ఆలయ నిర్మాణ పనులు**





**తొలి అక్షరం/చౌదరిగూడ, జూలై 14:** రంగారెడ్డి జిల్లా చౌదరిగూడ మండలం రావిర్యాల గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయ పునర్నిర్మాణ కార్యక్రమానికి మంగళవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా శ్రీకారం చుట్టారు. వైదిక మంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజల నడుమ మఠం ప్రదీప్ స్వామి, విజయ్ కుమార్ ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి భక్తులు నీళ్ల బిందెలు, పసుపు, కుంకుమ, పూలు, మారేడు పత్రి, కొబ్బరికాయలు తీసుకువచ్చి సంప్రదాయబద్ధంగా ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మహిళలు, పురుషులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొనడంతో గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గ్రామానికి ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిచిన ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణం చేపట్టడం సంతోషకరమని గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు గ్రామస్థులంతా తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఆంజనేయస్వామి అనుగ్రహంతో ఆలయ పునర్నిర్మాణం విజయవంతంగా పూర్తై గ్రామ ప్రజలకు శాంతి, సౌభాగ్యం, సుభిక్షం కలగాలని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మీరు పాపం చేసి మా మీద నెడతారా..!

**కొత్తూరు ఉమ్మడి మండల మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ నేత ఎం. శివశంకర్ గౌడ్**

**సిద్దాపూర్ భూములు కాలుష్య పరిశ్రమల తరలింపుపాపం "బిఆర్ఎస్ దే"**

**2018 టీఎస్ఐఐసీ పత్రాలలో మీరు సిద్ధాపూర్ కు చేసిన అన్యాయం కనిపించలేదా..?**

**ఇందిరమ్మ ఇచ్చిన భూములను బిఆర్ఎస్ పరిశ్రమల ఏర్పాటు పేరుతో లాక్కున్నారు**

**బినామీ పేర్లతో అదే భూముల్లో 9 కోట్లు అడ్డంగా దోచుకున్నారు**

**అధికారంలో ఉన్న ప్రజల పక్షానే..**

**తొలి అక్షరం/కొత్తూరు, జులై 14:** ఆనాడు బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం సిద్ధాపూర్ పేద ప్రజల భూముల విషయంలో అన్యాయంగా వ్యవహరించి కాలుష్యకార పరిశ్రమల తరలింపు పేరుతో వాటిని లాక్కుని చివరకు అదే భూములను బినామీ పేర్లతో 9 కోట్ల రూపాయలు వసూలు చేసి నాయకులు జేబులు నింపుకున్నది నిజం కాదా అని కొత్తూరు ఉమ్మడి మండల మాజీ ఎంపీపీ ఎం. శివ శంకర్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న జరిగిన సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక ఉద్యమం సందర్భంగా ఆయన పలు విషయాలు మీడియాకు వివరించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆనాటి ప్రధాని ఇందిరమ్మ పేద ప్రజలకు 200 ఎకరాలకు పైగా భూములను పంపిణీ చేస్తే ఆ భూములను కెసిఆర్ ప్రభుత్వం అడ్డంగా లాక్కుని దోచుకుందని అన్నారు. హైదరాబాద్ నగరం వెలుపల కాలుష్యకార పరిశ్రమల ఏర్పాటు పేరుతో సిద్దాపురం గ్రామాన్ని ఎంచుకొని ఆ భూములను ప్రజల నుండి బలవంతంగా లాక్కొని అందులో కాలుష్యకర పరిశ్రమలకు ఆనాటి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని శివశంకర్ గౌడ్ అన్నారు. అంతేకాదు సదరు భూముల్లో 90 ఎకరాలలో బినామీ పేర్లు సృష్టించిన బిఆర్ఎస్ నాయకులు కొందరు 9 కోట్ల రూపాయలకు పైగా దండుకొని జేబులో నింపుకున్నారని శివశంకర్ గౌడ్ విమర్శించారు. **ఇది నిజం కాదా..?** 2018 టీఎస్ఐఐసీ పత్రాలకు సంబంధించి మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ అనేక విషయాలు వెలుగులోకి తెచ్చారు. ఓఆర్ఆర్ వెలుపల కాలుష్య పరిశ్రమల ఏర్పాటుకు 233.10 ఎకరాల భూ సేకరణ ప్రతిపాదన రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో ప్రభుత్వ, అసైన్డ్ భూములను పరిశ్రమల పార్కు కోసం సేకరించాలన్న ప్రతిపాదన వెనుక అసలు ఉద్దేశం కాలుష్య పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) వెలుపలికి తరలించడమేనని మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ విమర్శించారు. 2018 నాటి టీఎస్ఐఐసీ అధికారిక పత్రాలలో బిఆర్ఎస్ ప్రభుత్వ ఆనాటి బండారాన్ని బయటపెడుతున్నాయని అన్నారు. 2018 జూలై 24న టీఎస్ఐఐసీ ల్యాండ్స్ వింగ్ విడుదల చేసిన ఇంటర్ ఆఫీస్ మెమోతో పాటు జోనల్ మేనేజర్ డి.రవి జిల్లా కలెక్టర్‌కు పంపిన ఫారం-బీ పత్రంలో, సిద్దాపూర్ గ్రామ సర్వే నంబర్లు 361, 252, 278లో మొత్తం 233 ఎకరాల 10 గుంటల ప్రభుత్వ, అసైన్డ్ భూమిని పరిశ్రమల పార్కు కోసం సేకరించాలని కోరారనీ ఈ పత్రాల్లో ఓఆర్ఆర్ వెలుపల కాలుష్య పరిశ్రమలను తరలించడం అనే ఉద్దేశాన్ని స్పష్టంగా పేర్కొన్నారన్నారు.



ఇందుకోసం భూమి గుర్తింపు పూర్తయిందని, భూ సేకరణ ప్రక్రియను తెలంగాణ భూ సేకరణ చట్టం2017 ప్రకారం వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆనాడు కోరినట్టు ఆధారాలతో సహా నిరూపిస్తానని చెప్పారు. అలాగే పరిశ్రమల ప్రాజెక్టును భూ సేకరణ చట్టంలోని కొన్ని నిబంధనల నుంచి మినహాయించాలని ప్రభుత్వం పరిశ్రమలు, వాణిజ్య శాఖకు 2018 జూలై 23న లేఖ రాసినట్లు కూడా పత్రాల్లో ప్రస్తావించారనీ గుర్తు చేశారు. ఇక జత చేసిన వివరాల ప్రకారం సిద్దాపూర్ గ్రామాల పరిధిలో మొత్తం 330.34 ఎకరాల భూమి అందుబాటులో ఉండగా, అందులో 233.10 ఎకరాలు అసైన్డ్ భూమి, 97.24 ఎకరాలు ప్రభుత్వ భూమిగా నమోదైనట్లు పేర్కొన్నారు. ఈ అధికారిక పత్రాలు వెలుగులోకి రావడంతో సిద్దాపూర్ భూముల సేకరణ ప్రతిపాదన, కాలుష్య పరిశ్రమల తరలింపు అంశంపై ప్రజలు వాస్తవాలు తెలుసుకొని బిఆర్ఎస్



పార్టీని నిలదీయాలని అన్నారు. **అధికారంలో ఉన్న ప్రజల పక్షానే..** కాంగ్రెస్ పార్టీకి రాజకీయాలు ఈ సమయంలో అనవసరమైనప్పటికీ ప్రజలకు వాస్తవాలు తెలపడానికి తాను పూర్తిస్థాయిలో కృషి చేస్తానని శివశంకర్ గౌడ్ స్పష్టం చేశారు. అధికారంలో తమ పార్టీ ఉన్నప్పటికీ ప్రజలకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ సహించబోమని ప్రభుత్వాన్ని మెప్పించి ఒప్పిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో ఈ ప్రాంతంలో 641 జీవో లేకుండా డంపింగ్ యార్డ్ రాకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. కేవలం స్వార్ధ రాజకీయాలు అనైతిక వ్యవహారాలతో కాంగ్రెస్ పార్టీని అప్రతిష్టపాలు చేస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

# "డ్రగ్స్ క్షణికానందం కాదు... జీవితకాల శిక్ష" ఎక్సైజ్ డీఎస్పీ సతీష్ కుమార్, ఎస్సై సుచరిత

**- డీఎస్పీ సతీష్ కుమార్, ఎస్సై సుచరిత ప్రసంగాలతో ఆలోచనలో పడిన విద్యార్థులు**

**- తల్లిదండ్రుల త్యాగాలను మరువొద్దు.. డ్రగ్స్‌కు కాదు లక్ష్యాలకు బానిసలవ్వాలని పిలుపు**

**- బీవీఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో డ్రగ్స్ నిర్మూలనపై చైతన్య సదస్సు**







**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జూలై 14:** "డ్రగ్స్ క్షణికానందాన్ని మాత్రమే ఇస్తాయి... కానీ జీవితాంతం శిక్షను మిగులుస్తాయి. మీ జీవితమే కాదు, మీ కుటుంబ భవిష్యత్తును కూడా నాశనం చేస్తాయి. అందుకే యువత డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలి" అని ఎక్సైజ్ డీఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. "మీ కోసం జీవితాన్ని త్యాగం చేస్తున్న అమ్మానాన్నను ఒక్క తప్పు నిర్ణయంతో కన్నీటి సముద్రంలో ముంచొద్దు. మీ విజయమే వారికి నిజమైన కానుక" అని ఎక్సైజ్ ఎస్సై సుచరిత విద్యార్థులకు హృదయాలను కదిలించే పిలుపునిచ్చారు. మంగళవారం నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో 'డ్రగ్స్ నిర్మూలన యువత బాధ్యత' అంశంపై కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎక్సైజ్ డీఎస్పీ సతీష్ కుమార్, ఎస్సై సుచరిత విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. డీఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుతం యువతను లక్ష్యంగా చేసుకుని మాదకద్రవ్యాల ముఠాలు పనిచేస్తున్నాయని, క్షణికానందం పేరుతో జీవితాలను నాశనం చేస్తున్నాయని హెచ్చరించారు. చదువుకునే వయసులో లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉండటమే కాదు, వాటి విక్రయం, వినియోగంపై సమాచారం తెలిసినా వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి విద్యార్థి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఎస్సై సుచరిత మాట్లాడుతూ, "మీ వెనుక తల్లిదండ్రుల త్యాగం, వారి కష్టం, వారి ఆశలు ఉన్నాయి. మీరు సాధించే ప్రతి విజయమే వారికి గర్వకారణం. అలాంటి వారి కలలను డ్రగ్స్ అనే విషంతో ఛిద్రము చేయవద్దు. సరదా కోసం చేసే ఒక్క తప్పు నిర్ణయం జీవితాన్ని చీకటిలోకి నెట్టేస్తుంది. సమస్యలు ఎదురైతే డ్రగ్స్ వైపు కాదు... తల్లిదండ్రులు, అధ్యాపకులు, అధికారుల వైపు అడుగు వేయండి" అని సూచించారు. డీఎస్పీ, ఎస్సై చేసిన ప్రసంగాలు విద్యార్థులను ఆలోచింపజేశాయి. సభ ముగిసిన అనంతరం విద్యార్థులంతా డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని, సమాజంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు తమ వంతు బాధ్యత నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పోలీస్ ఉన్నత అధికారులు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



**ఆంజనేయుడంటే...**
**ఆంజనేయుడంటే...**
**కొండను మోసిన బలం కాదు...**
**కొండంత వినయాన్ని మోసిన మహోన్నతత్వం.**
**ఆయనంటే...**
**గదను ధరించిన యోధుడు కాదు...**
**"శ్రీరామ" అనే రెండు అక్షరాలను**
**గుండెల్లో గుడిగా కట్టుకున్న మహాభక్తుడు.**
**భూమి మీద ఎన్నో దేవుళ్లు వరాలు ఇస్తారు...**
**కానీ ఆంజనేయుడు ఇచ్చేది వరం మాత్రమే కాదు...**
**మనిషి ఓడిపోకుండా నిలబడే ధైర్యం.**
**కన్నీళ్లు మాటలు మరిచిపోయిన వేళ,**
**మనసు దారి తప్పిపోయిన వేళ,**
**లోకం అంతా వెనక్కి తిరిగిన వేళ,**
**ఒక్కసారి "ఆంజనేయా!" అని పిలిస్తే చాలు...**
**నీ భుజంపై కనిపించని చేయి వేసి,**
**"నేనున్నాను బిడ్డా..." అని నిలబెట్టే కరుణాసాగరం.**
**ఆయన్ని నమ్మినవాడి ఇంట్లో**
**సంపద ముందుగా రాకపోవచ్చు...**
**కానీ సంకటాన్ని తట్టుకునే శక్తి ముందుగా వస్తుంది.**
**ఆయన్ని కొలిచినవాడికి**
**రాజ్యాలు దక్కకపోవచ్చు...**
**కానీ రాజులా జీవించే ఆత్మవిశ్వాసం తప్పక దక్కుతుంది.**
**ఆయన్ని సేవించినవాడికి**
**బంగారు కిరీటాలు దొరకకపోవచ్చు...**
**కానీ తల వంచని ఆత్మగౌరవం దైవప్రసాదంగా లభిస్తుంది.**
**ఆంజనేయుడు ఇచ్చే గొప్ప వరం...**
**కోరికలు తీర్చడం కాదు...**
**కష్టాలకే భయపడని హృదయాన్ని ప్రసాదించడం.**
**ఎందుకంటే...**
**గాలి ఆగిపోతే దీపం ఆరిపోతుంది...**
**కానీ ఆంజనేయుడి అనుగ్రహం ఉంటే,**
**మనిషిలోని ఆశ అనే జ్యోతి ఎన్నటికీ ఆరిపోదు.**
**రామనామమే శ్వాసగా,**
**ధర్మమే దారిగా,**
**భక్తినే జీవితంగా నిలబెట్టిన ఆ మహావీరుడు**
**యుగయుగాలకూ మనలో ధైర్యంగా జీవిస్తూనే ఉంటాడు.**
**"భక్తుడి కన్నీరు నేలను తాకకముందే**
**అది ప్రార్థనగా మారే స్థలం ఆంజనేయుని పాదాలు...**
**ఆయన కృప పడిన జీవితం**
**గెలుపు కోసం కాదు...**
**ధర్మం కోసం నిలిచే జీవితం."**

**- రచన: శివకుమారి**
**ఆంజనేయ స్వామి భక్తురాలు**



# కార్మిక కర్షక ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

**కూలి బందు వెంటనే అమలు చేయాలి**

**సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జూలై 14:** కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ కార్మికుల కార్మికుల కర్షకుల గ్రామీణ పేదల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని సిపిఎం పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం తొర్రూరు మండల కేంద్రంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనం లో పార్టీ మండల కమిటీ సభ్యులు మార్క సాంబయ్య అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మండల సెమినార్ జరిగింది. ఈ సెమినార్ కు ముఖ్యఅతిథిగా హాజరైన సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి, వివిజి రాంజీ పథకాన్ని కాంట్రాక్టర్లకు, ధనిక వర్గానికి లాభం కలిగించే విధంగా వివిజి రాంజీ పథకాన్ని తీసుకొచ్చిందని 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడులను తెచ్చింది. కార్మికులు ట్రెడిషనల్ పెట్టుకోవడానికి ఆంక్షలు పెట్టడం సామాజిక భద్రత కార్పొరేట్ సంస్థలు తమ స్వలాభం కొరకే పాలకవర్గాలు పాటుపడుతున్నాయని వారన్నారు. వివిజి రామ్ జి చట్టంలో 125 రోజులు పని దినాలు పెంచారు. పెరిగిన పని దినాలు కనుగుణంగా నిధులు పెంచలేదు. పైగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 90% నిధుల్లో 60 శాతం మాత్రం ఇస్తామని 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని వ్యవసాయ

సీజన్లు 60 రోజులు పని దినాలు బందు చేయాలని పథకంలో పేర్కొనడం రాజ్యాంగబద్ధంగా పేదలకు పని కల్పించే బాధ్యత నుండి తప్పుకోవడమే అవుతుందన్నారు. విద్యుత్ సవరణ చట్టం 2025 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలపై జూలై 15 నుండి ఆగస్టు 10 వరకు గ్రామస్థాయి నుండి జిల్లా వరకు ఆందోళన పోరాటాలు నిర్వహించాలని, ఆగస్టు 10న జైలు బరో కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు గునగంటి రాజయ్య,




మండల కార్యదర్శి ఎండి యాకుబ్, జన్నపరెడ్డి సోమిరెడ్డి, జమ్మల శ్రీను, బోర స్వామి, డోనక దుర్గయ్య,

బొల్లం మమత, ధరావత్ యాకన్న సుమన్ ,కంటపాలెం గ్రామ ఉపసర్పంచ్ జితేందర్ రెడ్డి, శంకర్, ఉమ్మగాని యాకయ్య, సోమయ్య , సంతోష్ , అమీర్, మధుబాబు, కొండ రాము, రామకృష్ణ ,రాధ, షమీనా, భాగ్య, ఆమీనా, శ్రీలత, నాగమణి, అందే మంజుల, వరలక్ష్మి ,లక్ష్మి,, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# అర్చకుల సంక్షేమానికి పెద్దపీట వేయాలి

**• ధర్మ పరిరక్షణకు అర్చకుల గౌరవం ముఖ్యం • అర్చకుల సంక్షేమం,బ్రాహ్మణుల ఐక్యతే శాశ్వత పరిష్కారం • సమాజ అభ్యున్నతికి ఐక్యత అత్యావశ్యకం**

**• ది సౌత్ ఇండియా టైమ్స్ బ్యూరో చీఫ్ డా. జితేందర్ రావు తనుగుల స్పష్టీకరణ**



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూలై14:** భారతీయ సంస్కృతి, వేద సంప్రదాయం, సనాతన ధర్మ పరిరక్షణలో బ్రాహ్మణ సమాజం శతాబ్దాలుగా విశిష్టమైన పాత్ర పోషిస్తోందని సీనియర్ జర్నలిస్టు,ది సౌత్ ఇండియా టైమ్స్ ఆంగ్ల దినపత్రిక బ్యూరో చీఫ్, తెలంగాణ యూత్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టివైజెఎఫ్)అధ్యక్షులు డా.జితేందర్ రావు తనుగుల పేర్కొన్నారు. దేవాలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కావని, అవి ఆధ్యాత్మికత, సంస్కృతి, నైతిక విలువలు, సామాజిక సమగ్రతకు ప్రతీకలని ఆయన స్పష్టం చేశారు. ఈ మహోన్నత వ్యవస్థకు అర్చకులు, వేద పండితులు, ఆగమ శాస్త్ర నిపుణులు జీవనాడిగా నిలుస్తున్నారని, సమాజంలో ధర్మబద్ధమైన జీవన విధానాన్ని, సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించే పవిత్ర బాధ్యతను వారు నిర్వర్తిస్తున్నారని కొనియాడారు. మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా అర్చకుల సంక్షేమం, గౌరవప్రదమైన జీవనం, సామాజిక భద్రత, ఆరోగ్య రక్షణ, పిల్లల విద్య, వేద విద్యాభివృద్ధి, నైపుణ్య శిక్షణ వంటి అంశాలకు మరింత ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఉందని డా. జితేందర్ రావు అభిప్రాయపడ్డారు.దేవాలయాల అభివృద్ధి ఎంత ముఖ్యమో, వాటిని నిత్యం సేవాభావంతో నిర్వహించే అర్చకుల సంక్షేమం కూడా అంతే ముఖ్యమని ప్రభుత్వం, దేవాదాయ శాఖ, భక్తులు మరియు సమాజం గుర్తించాలన్నారు. ప్రభుత్వాలు అర్చకుల సంక్షేమం కోసం చేపట్టే సానుకూల చర్యలు, దేవాదాయ వ్యవస్థలో పారదర్శకత, వేద పాఠశాలలకు ప్రోత్సాహం, యువ అర్చకులకు శిక్షణ, వృద్ధ అర్చకులకు సామాజిక భద్రత వంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా అమలవ్వాలని ఆయన కోరారు. అలాగే భక్తులు, దాతలు, ధార్మిక సంస్థలు కూడా తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలన్నారు. అర్చకుల గౌరవం కేవలం ఒక వర్గం గౌరవం కాదు అది భారతీయ సంస్కృతికి, ఆధ్యాత్మిక వారసత్వానికి ఇచ్చే గౌరవం. అందుకే అర్చకుల సంక్షేమాన్ని సమాజ సంక్షేమంలో ఒక ముఖ్యమైన అంశంగా చూడాలి అని డా. జితేందర్ రావు తనుగుల అభిప్రాయపడ్డారు. బ్రాహ్మణ సమాజం కాలానుగుణంగా ఐక్యతతో ముందుకు సాగాలని డా. జితేందర్ రావు పిలుపునిచ్చారు. వైదిక, నియోగి, తెలంగాణ, వెలనాటి, ఆర్వేల లేదా ఇతర శాఖల పేర్లు కేవలం సంప్రదాయ గుర్తింపులు మాత్రమేనని, అవి ఏమాత్రం విభేదాలకు కారణం కాకూడదని స్పష్టం చేశారు. వ్యక్తిగత అభిప్రాయ భేదాలు సహజమే అయినప్పటికీ, సమాజ ప్రయోజనాల విషయంలో అందరూ ఒకే వేదికపై నిలవాల్సిన అవసరం ఉందన్నారు. విభేదాలు సమాజాన్ని బలహీనపరుస్తాయని, పరస్పర గౌరవం, ఐక్యత మాత్రమే బలాన్ని ఇస్తాయని గుర్తుచేశారు.

### ఆధునిక విద్యతో పాటు సంప్రదాయ జ్ఞానం

బ్రాహ్మణ సమాజం విద్య, సేవ, సంస్కృతి, ఆధ్యాత్మికత అనే నాలుగు బలమైన స్తంభాలపై నిలబడి దేశ నిర్మాణంలో విశేష సేవలు అందించిందని ఆయన గుర్తుచేశారు.
ఈ గొప్ప వారస త్వాన్ని భావితరాలకు అందించాలంటే యువతలో వేదాలపై అవగాహన పెంచడం, ఆధునిక విద్యతో పాటు సాంప్రదాయ జ్ఞానాన్ని ప్రోత్సహించడం, ధార్మిక విలువలను బలోపేతం చేయడం అత్యవసరమన్నారు. బ్రాహ్మణ సమాజం బలపడితే వేద సంప్రదాయం బలపడుతుందని, తద్వారా సనాతన ధర్మం మరింత సుస్థిరమవుతుందని వివరించారు.ధర్మాన్ని తెలుసుకోవడం గొప్ప విషయం దానిని ఆచరించి సమాజానికి ఆదర్శంగా నిలవడం ఇం కా గొప్ప విషయం అని డా. జితేందర్ రావు తనుగుల స్పష్టం చేశారు.

# సిబ్బంది ఆరోగ్య రక్షణే ప్రథమ కర్తవ్యం: ఏసీపీ సంపత్ కుమార్

**• సిబ్బంది ఫిట్‌నెస్ మన విభాగానికి గర్వకారణం: ఎస్‌హెచ్‌ఓ (సిఐ) జి.నాగరాజు • ఉప్పల్ ట్రాఫిక్ సిబ్బందికి కొండంత అండ • ఘనంగా మెగా హెల్త్ క్యాంప్ • డీసీపీల పర్యవేక్షణలో విజయవంతంగా ఉచిత వైద్య శిబిరం**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూలై 14:** ప్రజల భద్రత,సురక్షిత ప్రయాణాల కోసం నిరంతరం రోడ్లపై శ్రమిస్తూ,కాలుష్యం,ఎండలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించే ఉప్పల్ ట్రాఫిక్ పోలీసుల సంక్షేమం కోసం ఉన్నతాధికారులు ఒక గొప్ప ముందడుగు వేశారు. మల్కాజిగిరి జిల్లా నగర పోలీస్ కమిషనర్ (సీపీ) బి.సుమతి ఉత్తర్వుల మేరకు,డీసీపీ ట్రాఫిక్-11 వి. శ్రీనివాసులు, డీసీపీ ట్రాఫిక్-1 రాహుల్ ల సమర్థవంతమైన మార్గదర్శకత్వంలో ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రెటినోవా ఫౌండేషన్ భాగస్వామ్యంతో మెగా హెల్త్ క్యాంప్‌ను అత్యంత ప్రొఫెషనల్‌గా నిర్వహించారు. ఈ బృహత్తర శిబిరంలో 120 మంది ట్రాఫిక్ పోలీస్




అధికారులు,సిబ్బందికి ఉచితంగా రక్తపోటు (బీపీ), షుగర్,దంత (డెంటల్),గుండె సంబంధిత ముందస్తు రక్షణ కోసం ఈసీజీ వైద్య పరీక్షలు విజయవంతంగా నిర్వహించారు.

### శాంతిభద్రతల పరిరక్షణలోనే కాదు.. సిబ్బంది క్షేమంలోనూ అగ్రస్థానం: ఏసీపీ సంపత్ కుమార్

ఈ సందర్భంగా క్యాంప్‌ను ప్రారంభించి పర్యవేక్షించిన ఏసీపీ సంపత్ కుమార్ మాట్లాడుతూ... ఉన్నతాధికారుల ఆదేశాల



మేరకు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు.ప్రజలకు నిరంతరం మెరుగైన సేవలందించడంలో ఉప్పల్ ట్రాఫిక్ విభాగం ఎల్లప్పుడూ ముందుంటుంది.అయితే, తీవ్రమైన మానసిక ఒత్తిడి,కాలుష్య వాతావరణంలో పనిచేసే మన సిబ్బంది ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. ఏసీపీ కార్యాలయం ఎల్లప్పుడూ సిబ్బంది సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇస్తుంది. ప్రతి ఒక్కరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని తమ శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవాలి.

### క్రమబద్ధమైన వైద్య తనిఖీలతో పెద్ద పెద్ద అనారోగ్య సమస్యలను సైతం దూరం పెట్టవచ్చు.-సంపత్ కుమార్, ఏసీపీ (ట్రాఫిక్)

ఈ కార్యక్రమాన్ని దగ్గరుండి విజయవంతం చేసిన ఉప్పల్ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ జి. నాగరాజు మాట్లాడుతూ....ప్రతి ఒక్క సిబ్బంది ఆరోగ్య నియమాలు పాటించాలని సూచించారు.విధి నిర్వహణలో సిబ్బంది చూపించే అంకితభావం అభినందనీయం.కానీ విధులతో పాటు సొంత ఆరోగ్యాన్ని, జీవనశైలిని కాపాడుకోవడం కూడా వారి ప్రాథమిక బాధ్యత. అందుకే ఈ ఉచిత హెల్త్ క్యాంప్‌ను రెటినోవా ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేశాం. గుండె సంబంధిత పరీక్షలు (ఈసీజీ),దంత పరీక్షలు సిబ్బందిలో మరింత భరోసాని నింపాయి.

### మన సిబ్బంది సంపూర్ణ ఆరోగ్యంతో, చురుగ్గా విధుల్లో పాల్గొనడమే మా ప్రధాన లక్ష్యం: జి. నాగరాజు, ఎస్‌హెచ్‌ఓ, ఉప్పల్ ట్రాఫిక్

ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ గోవర్ధన్,స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్లు (ఎస్సైలు), సిబ్బంది,రెటినోవా ఫౌండేషన్ నిపుణులైన వైద్యుల బృందం చురుగ్గా పాల్గొని సేవలందించారు. ఉన్నతాధికారుల చొరవతో తమకు పోలీస్ స్టేషన్ పరిధిలోనే ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందడంపై ట్రాఫిక్ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ..కృతజ్ఞతలు తెలిపారు.

# ధ్వని కాలుష్యంపై మల్కాజ్‌గిరి పోలీసుల ఉక్కుపాదం

**• మార్చబడిన సైలెన్సర్లతో తిరిగితే చేతికి బేడీలు... జేబుకు చిల్లులే • సీపీ సుమతి ఉత్తర్వులతో రంగంలోకి ట్రాఫిక్ విభాగాలు • ఒక్క రోజే 439 కేసులు,రూ.6.32 లక్షల జరిమానా**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూలై14:** రోడ్లపై చెవులు చిల్లులు పడేలా వికృత శబ్దాలు చేస్తూ బైక్‌లపై దూసుకెళ్లే పోకిరీల ఆటకట్టించేందుకు మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్ పోలీసులు కదంతొక్కారు.మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ (సీపీ) సుమతి ఐపీఎస్ జారీ చేసిన ప్రత్యేక ఉత్తర్వుల మేరకు..నిబంధనలకు విరుద్ధంగా మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చి, తీవ్రమైన ధ్వని కాలుష్యానికి కారణమవుతున్న వాహనాలపై మంగళవారం విస్తృతమైన ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మల్కాజ్‌గిరి ట్రాఫిక్-1 డీసీపీ కె.రాహుల్ రెడ్డి ఐపీఎస్, ట్రాఫిక్-2 డీసీపీ వి. శ్రీనివాసులు పర్యవేక్షణలో కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్ ఏసీపీలు, సీఐలు, ఎస్సై లు, ట్రాఫిక్ సిబ్బంది క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగి ఈ ముమ్మర తనిఖీల్లో పాల్గొన్నారు.

ఈ సోదాల్లో నిబంధనలు ఉల్లంఘించిన వందలాది వాహనదారులపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. కమిషనరేట్ వ్యాప్తంగా రెండు జోన్ల పరిధిలో నిర్వహించిన ఈ మెరుపు దాడుల్లో మొత్తం 439 కేసులు నమోదు కాగా, ఉల్లంఘనుల నుంచి రూ. 6,32,000 జరిమానా రూపంలో వసూలు చేశారు. అంతేకాకుండా, నిబంధనలు అతిక్రమించిన 12 వాహనాల సైలెన్సర్లను పోలీసులు అక్కడికక్కడే తొలగించి స్వాధీనం చేసుకున్నారు.

### జోన్ల వారీగా పోలీసుల కొరడా:

ఉన్నతాధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో కమిషనరేట్ పరిధిలోని రెండు జోన్లలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

### జోన్-1లో అత్యధిక కేసులు:

జోన్-1 పరిధిలోని మల్కాజ్‌గిరి, గోపాల్‌పురం, జవహర్‌నగర్, తిరుమలగిరి, అల్వాల్, బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో అత్యధికంగా 250 కేసులు నమోదయ్యాయి.వీరి నుంచి రూ. 3,62,000 జరిమానా వసూలు చేయడంతో పాటు 9 సైలెన్సర్లను తొలగించారు. ఇందులో ముఖ్యంగా తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోనే అత్యధికంగా 69 కేసులు నమోదు కావడం గమనార్హం.

### జోన్-2లోనూ ముమ్మర తనిఖీలు:

ఎల్బీనగర్, వనస్థలిపురం, ఉప్పల్, కుషాయిగూడ, ఘాట్‌కేసర్ పరిధిలోకి వచ్చే జోన్-2లో 189 కేసులు నమోదు చేసి, రూ. 2,70,000 జరిమానా విధించారు. ఈ జోన్‌లో 3 సైలెన్సర్లను సీజ్ చేశారు.

### చట్టం ఏం చెబుతోంది?

మోటార్ వాహనాల చట్టం (ఎంవిఏ) సెక్షన్ 190(2), సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్స్ (సిఎంవిఏ)120 నిబంధనల ప్రకారం...అనుమతించబడిన పరిమితి కంటే ఎక్కువ ధ్వని కాలుష్యాన్ని కలిగించే సైలెన్సర్లను వాడటం చట్టరీత్యా నేరం.రోడ్లపై వికృత శబ్దాలు చేస్తూ ప్రజలను, ముఖ్యంగా వృద్ధులు, రోగులు, చిన్నారులను భయాందోళనలకు గురిచేసే

**Malkajgiri Commissionerate**
**Special Drive cases on Emitting sound pollution using silencer**
**Dt:14.07.2026**

| S.No | Police station | Emitting sound pollution using silencer | | Number of removed silencers |
|---|---|---|---|---|
| | | Cases | Amount | |
| 1 | Malkajgiri Tr PS | 40 | 61000 | 0 |
| 2 | Gopalpuram Tr PS | 35 | 52000 | 3 |
| 3 | Jawaharnagar Tr PS | 25 | 37000 | 2 |
| 4 | Trimulgherry Tr PS | 69 | 103000 | 2 |
| 5 | Alwal Tr PS | 23 | 34000 | 0 |
| 6 | Begumpet Tr PS | 58 | 75000 | 2 |
| **Zone- I** | | **250** | **362000** | **9** |
| 1 | LB Nagar Tr PS | 47 | 71000 | 0 |
| 2 | Vanasthalipuram Tr PS | 53 | 74000 | 3 |
| 3 | Uppal Tr PS | 62 | 89000 | 0 |
| 4 | Kushaiguda Tr PS | 12 | 15000 | 0 |
| 5 | Ghatkesar Tr PS | 15 | 21000 | 0 |
| **Zone- II** | | **189** | **270000** | **3** |
| **Total** | | **439** | **632000** | **12** |

Section:
Emitting sound pollution using silencer - CMVR 120 r/w 190(2) MVA

వారిపై చర్యలు ఇక్కడితో ఆగవు. బైక్‌ల సైలెన్సర్లు మార్చే మెకానిక్‌లపై కూడా నిఘా ఉంచుతాం.

రాబోయే రోజుల్లో ఈ తనిఖీలను మరింత తీవ్రతరం చేస్తాం అని ట్రాఫిక్ ఉన్నతాధికారులు హెచ్చరించారు. వాహనదారులు కంపెనీ ఇచ్చిన సైలెన్సర్లను మాత్రమే వాడాలని, నిబంధనలు అతిక్రమిస్తే వాహ నాలను సీజ్ చేయడానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు.




## వేంకటేశ్వర స్వామిగా రాజేంద్రప్రసాద్

రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్ ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం 'మిస్టర్ మిడిల్ క్లాస్' . జి.నాగేశ్వరరావు దర్శకత్వం వహించిన ఈ సినిమా జులై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో వేంకటేశ్వర స్వామిగా రాజేంద్రప్రసాద్ నటించగా.. భక్తుడిగా శ్రీకాంత్ కనిపించనున్నారు.

-------

# తదుపరి ప్రాజెక్టులపై నాగచైతన్య దృష్టి

### సోషల్ మీడియా ప్రచారాలను తిప్పికొట్టిన టీమ్



అక్కినేని నాగచైతన్య తదుపరి ప్రాజెక్టులపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు వైరల్ అవుతున్నాయి. అధికారిక ప్రకటన ఏదీ లేకపోయినా, ఆయన కొత్త సినిమాల లైనప్ గురించి ఎంటర్‌టైన్‌మెంట్ పేజీలు, సినీ వర్గాలకు చెందిన సోషల్ మీడియా ఖాతాల్లో వరుస పోస్టులు దర్శనమివ్వ డంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ఇద్దరు కొత్త దర్శకులతో చైతన్య సినిమాలు చేయబోతున్నారనే ప్రచారం హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం 'వృషకర్మ' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న నాగచైతన్య, ఆ తర్వాత పూర్తిస్థాయి హారర్ థ్రిల్లర్‌లో నటించనున్నట్లు ప్రచారం జరిగింది. మసూద చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సాయి కిరణ్ చెప్పిన కథను చైతన్య ఇప్పటికే విన్నారని, ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ బ్యానర్‌పై ఈ సినిమా రూపొందే అవకాశం ఉందని వార్తలు చక్కర్లు కొట్టాయి. కథ నచ్చడంతో కేవలం తుది నిర్ణయం మాత్రమే మిగిలి ఉందని కూడా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అంతేకాకుండా బెదురులంక దర్శకుడు క్లాక్స్ దర్శకత్వంలోనూ నాగచైతన్య ఓ కొత్త కాన్సెప్ట్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే వార్తలు కూడా వైరల్ అయ్యాయి. 'వృషకర్మ' షూటింగ్ పూర్తయ్యాక ఈ ఏడాది చివర్లో ఆ సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశముందని పలు కథనాలు పేర్కొన్నాయి. వరుసగా ఇద్దరు కొత్త తరహా దర్శకుల పేర్లు వినిపించడంతో అభిమానులు ఈ ప్రాజెక్టులపై ఆసక్తి చూపడం ప్రారంభించారు. అయితే సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ ప్రచారానికి నాగచైతన్య టీమ్ స్పష్టత ఇచ్చింది. మసూద దర్శకుడు సాయి కిరణ్‌తో సినిమా ఖరారైందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని వెల్లడించింది. ఇప్పటివరకు ఇద్దరి మధ్య స్క్రిప్ట్ చర్చలు గానీ, అధికారిక సమావేశాలు గానీ జరగలేదని స్పష్టం చేసినట్లు సమాచారం. అలాగే క్లాక్స్‌తో సినిమా విషయంలో కూడా ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కొత్త దర్శకుల నుంచి కథలు వింటున్న మాట నిజమే అయినప్పటికీ, ఏ ప్రాజెక్ట్‌కూ ఇంకా తుది ఆమోదం ఇవ్వలేదని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

# రావ్ బహద్దూర్ అందరూ చూడాల్సిన మూవీ

### ప్రశంసలు కురిపించిన దర్శకుడు సందీప్ వంగా




ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఇటీవలే విడుదలైన 'రావ్ బహదూర్' చిత్రంపై ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా చూసిన అనంతరం ఆయన సోషల్ మీడియా వేదికగా తన రివ్యూను పంచుకున్నారు. సినిమాను గొప్పగా తీసిన చిత్ర బృందాన్ని అభినందించారు. మనం సినిమాను ఎందుకు అంతగా ప్రేమిస్తామో మరోసారి గుర్తుచేసే అరుదైన చిత్రాల్లో 'రావు బహదూర్' ఒకటి. సినిమా ప్రేమికుడికి నాదొక చిన్న విన్నపం.. మీ జీవితంలోని మూడు గంటల సమయాన్ని 'రావ్ బహదూర్'కు ఇవ్వండి. కచ్చితంగా మీకు నచ్చుతుంది. అన్ని ప్రశంసలు అందుకునేందుకు దీనికి పూర్తి అర్హత ఉంది. వెంకటేశ్ మహా తక్కువ బ్జడెట్‌లో అద్భుతంగా రూపొందించారు. ఎంతో ధైర్యం, తనపై తనకు బలమైన నమ్మకం ఉన్న వాళ్లు మాత్రమే ఇలా తెరకెక్కించగలరు. ఇక సత్యదేవ్ తన నటనతో అదరగొట్టారు. ఇందులో ఎలాంటి అనవసరమైన హడావుడి లేదు, షార్ట్‌కట్‌లు లేవు. కేవలం స్వచ్ఛమైన కథ మాత్రమే కనిపిస్తుంది' అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇలాంటి సినిమాలను కచ్చితంగా సెలబ్రేట్ చేసుకోవాలని అన్నారు.

----------

# తుంబాడ్-2 లో ఆలియా



భారతీయ చలనచిత్ర రంగంలో అద్భుతమైన విజువల్స్, అద్భుతమైన కథాంశంతో కల్ట్ క్లాసిక్‌గా నిలిచిన హారర్ థ్రిల్లర్ చిత్రం 'తుంబాడ్'. ఈ సినిమా సీక్వెల్ 'తుంబాడ్ 2' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా, ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సంబంధించి చిత్ర పరిశ్రమలో ఒక భారీ సంచలన అప్‌డేట్ వెలువడింది. బాలీవుడ్ స్టార్ నటి ఆలియా భట్ అధికారికంగా 'తుంబాడ్ 2' చిత్రబృందంలో చేరింది. ఈ విషయాన్ని సినిమా హీరో మరియు నిర్మాత సోహమ్ షా సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడిస్తూ ఆలియాకు ఘన స్వాగతం పలికారు. ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది.. 'తుంబాడ్ 2' లోకి స్వాగతం ఆలియా భట్. ప్రళయం రాబోతోంది' అంటూ సోహమ్ షా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఆలియాతో దిగిన ఫోటోలను పంచుకున్నారు. ఈ సినిమాలో భాగం కావడంపై ఆలియా భట్ సైతం హర్షం వ్యక్తం చేసింది. తాను మొదటిసారి 'తుంబాడ్' చూసినప్పటి నుంచి ఆ చిత్రం తన మనసులోనే ఉండిపోయిందని, ఇంతటి ప్రత్యేకమైన ప్రపంచంలోకి అడుగుపెట్టడం చాలా సంతోషంగా ఉందని ఆమె పేర్కొంది. సోహమ్ షా, నవాజుద్దీన్ సిద్ధిఖీ వంటి అద్భుతమైన నటులతో కలిసి పనిచేయడానికి తాను ఎంతగానో ఎదురుచూస్తున్నట్లు తెలిపింది. ఇక 'తుంబాడ్ 2' లో ఆలియా భట్ పాత్ర కేవలం అతిథి పాత్రగా కాకుండా కథను మలుపు తిప్పే కీలకమైన రోల్‌గా ఉండబోతోంది. దాదాపు రూ.100 కోట్ల భారీ బ్జడెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ సీక్వెల్‌కు ఆదేశ్ ప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 3, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



----

# తండ్రి విజయ్ కోసం సంజయ్ త్యాగం

### జననాయగన్ కోసం సిగ్మా మూవీ వాయిదా




విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ 'సిగ్మా'తో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విజయ్ సినిమా కోసం సంజయ్ తన సినిమాను వాయిదా వేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. 'జన నాయగన్' జులై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఏడు నెలల నిరీక్షణ అనంతరం వస్తోన్న ఈ సినిమా కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. దీనికి లైన్ క్లియర్ చేయడం కోసం సంజయ్ తన సినిమాను వాయిదా వేసుకుంటున్నారని సమాచారం.సందీప్ కిషన్ కథానాయకుడిగా రూపొందిన 'సిగ్మా' చిత్రాన్ని జులై 31న విడుదల చేయాలని మొదట భావించారు. 'జన నాయగన్' జులై చివరి వారంలో వస్తుండటంతో.. ఈ సినిమా విడుదలను ఆగస్టుకు వాయిదా వేసినట్లు సమాచారం. గతంలో సంజయ్ ఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. ఇది తన జీవితంలో ఎంతో ప్రత్యేకమైన సినిమా అని చెప్పారు. ఆగస్టులో పెద్ద సినిమాలేవీ లేకపోవడంతో అప్పుడు రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక అప్‌డేట్ రావాల్సి ఉంది. ఇక విజయ్ కుమారుడు సంజయ్‌కు సంబంధించిన మరో వార్త కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కేవలం దర్శకుడిగానే కాకుండా త్వరలోనే నటుడిగా కూడా వెండితెరకు పరిచయం కానున్నట్లు సమాచారం. ప్రముఖ నిర్మాత జీకేఎమ్ తమిళ్ కుమారన్ తన సొంత బ్యానర్‌పై సంజయ్‌ను హీరోగా పరిచయం చేయనున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. విజయ్ సినిమాల నుంచి వైదొలగిన నేపథ్యంలో ఆయన కుమారుడు వెండితెరకు పరిచయం కానున్నట్లు వార్తలు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# 'తెలుగు సినిమా.. హిందీ సినిమా' ఇదేం విభజన? - అడివి శేష్



భాషల ఆధారంగా సినిమాలను విభజించే విధానంలో మార్పు రావాల్సిన సమయం ఆసన్నమైందని హీరో అడివి శేష్ అభిప్రాయపడ్డాడు. దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునే సినిమాలను ఒకే భాషకు పరిమితం చేయడం సరైన విధానం కాదన్నాడు. దేశమంతా ఆదరించే కథలకు భాష అడ్డంకిగా మారకూడదని అభిప్రాయపడ్డాడు.ఇప్పటికీ 'హిందీ సినిమా', 'తెలుగు సినిమా', 'తమిళ సినిమా' అంటూ వేర్వేరుగా పిలుస్తూనే, మరోవైపు 'పాన్ ఇండియా సినిమా' అనే పదాన్ని ఉపయోగించడం ఆసక్తికరంగా అనిపిస్తోందని శేష్ చెప్పాడు. ఒక సినిమా దేశవ్యాప్తంగా ప్రేక్షకులతో భావోద్వేగ అనుబంధాన్ని ఏర్పరచగలిగితే దాని గుర్తింపును భాషతో ఎందుకు పరిమితం చేయాలని ప్రశ్నించాడు. కథలను భాషల గీతల్లో కాకుండా భారతీయ కథలుగా స్వీకరించినప్పుడే నిజమైన పాన్ ఇండియా సినిమా ఆవిష్కృతమవుతుందని అన్నాడు.

భాష అనేది భావాలను వ్యక్తీకరించే సాధనం మాత్రమేనని, అది ఎప్పుడూ పరిమితిగా మారకూడదని అడివి శేష్ పేర్కొన్నాడు. ఇప్పుడు ప్రేక్షకులు గతంతో పోలిస్తే ఎంతో మారిపోయారని చెప్పాడు. మంచి కథ ఎక్కడి నుంచి వచ్చినా ఆదరిస్తున్నారని, ప్రేక్షకుల ఆలోచనా విధానానికి తగ్గట్టు సినీ పరిశ్రమ కూడా మారాల్సిన అవసరం ఉందన్నాడు.సినీ సృష్టికర్తల బాధ్యత నిజాయతీతో కూడిన కథలను అందరికీ చేరేలా రూపొందించడమేనని శేష్ అన్నాడు. ఒక భాష మార్కెట్‌ను మాత్రమే లక్ష్యంగా పెట్టుకోకుండా దేశం మొత్తం సొంతం చేసుకునే సినిమాలను రూపొందించాలన్నదే తమ లక్ష్యమని చెప్పాడు.ప్రస్తుతం అడివి శేష్ నటించిన 'డెకాయిట్: ఏ లవ్ స్టోరీ' విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటించింది. అనురాగ్ కశ్యప్, ప్రకాశ్‌రాజ్, సునీల్, జైన్ మేరీ ఖాన్, అతుల్ కులకర్ణి కీలక పాత్రలు పోషించారు. అలాగే 'గూఢచారి'కి సీక్వెల్‌గా తెరకెక్కుతున్న 'జీ2' చిత్రంలో కూడా అడివి శేష్ నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, వామికా, మధు శాలిని ఇతర ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు.